

భీమవరంలో టెన్షన్.. టెన్షన్

- ఎన్నికల వేళ రోడ్లపై తగాదాలు
- పంచాయితీ చేసి పంపిస్తున్న పోలీసులు

భీమవరం క్రైం, మార్చి 5 : ఎన్నికలు సమీపిస్తున్న వేళ భీమవరం పట్టణంలో రోడ్లపై పంచాయితీలు పెరిగాయి. ఎన్నికల కోడ్ రాక ముందే కొంత మంది బాహాబాహీకు దిగుతున్నారు. దీంతో రోడ్లపై ప్రయాణించే వారు భయపడే పరిస్థితి నెలకొంది. కొన్ని రాజకీయ పార్టీల వారు కావాలనే కొందరిపై దాడులకు దిగటం సర్వసాధారణంగా మారింది. సాయంత్రం నుంచి అర్ధ రాత్రి వరకూ పూటుగా మద్యం సేవించినవారు రాజకీయాలకు సంబంధించిన విషయాలు మాట్లాడుతూ అవతలివారిని రెచ్చగొట్టడంతో తగాదాలు వస్తున్నాయి. చివరకు పోలీసుల వచ్చి పంచాయతీలు చేసి తిరిగి పంపేస్తున్నారు. రెండు రోజుల క్రితం భీమవరం పోలీస్ బొమ్మ సెంటర్‌లో ఇద్దరు ఆటో డ్రైవర్లు ఘర్షణకు దిగారు. చివరకు రాడ్లతో కొట్టుకునే పరిస్థితి నెలకొనడంతో స్థానికులు వారిని ఆపి సర్దిచేసి పంపారు. అలాగే నెలరోజుల క్రితం బైపాస్ రోడ్డులోని ఒక మద్యం దుకాణం వద్ద కొందరు యువత బీరు సీసాలతో దాడి చేసుకుని తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని ఆసుపత్రికి తరలించారు. సుమారు 20 రోజుల క్రితం స్థానిక మెంటేవారితోటలో కొందరు యువత ఘర్షణకు దిగారు. పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో పారిపోయారు.


పోలీసులంటే భయం లేదు..

గతంలో పోలీసులు రాత్రి 8 గంటల నుంచి సీఐ స్థాయి అధికారి నుంచి కింది స్థాయి అధికారి వరకు గస్తీ తిరిగేవారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం పోలీసులు ఎక్కువగా గస్తీ తిరగకపోవడంతో యువత రెచ్చిపోతున్నారు. సాయంత్రం 7 గంటల నుంచి రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవించి ఆ ప్రాంతాల్లో ఉన్నవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.భీమవరం జిల్లా కేంద్రంగా మారినప్పటి నుంచి పరిస్థితులు తారుమారయ్యాయి. పోలీసులు ఆకతాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టి సరైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'టెట్'కు 65 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 5 : జిల్లాలో టెట్‌కు మంగళవారం ఉదయం 109 మంది, మధ్యాహ్నం 58 మంది అభ్యర్థులు హాజరైనట్టు డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 65 మంది గైర్హాజరైయ్యారని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు.

ముసుగు తొలగింది!



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ : మన పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించేవారు ఎవరైనా ఉన్నారా?

వలంటీర్: చాలామంది ఉన్నారు.

కో-ఆర్డినేటర్: మీ క్లస్టర్‌లో ఎంతమందిని గుర్తించారు.

వలంటీర్: కొన్ని కుటుంబాలు వ్యతిరేకిస్తున్నారు.

కో-ఆర్డినేటర్: వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా ?

వలంటీర్: కొందరికి అందుతున్నాయి.

కో-ఆర్డినేటర్: వారిని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా మలచండి. ఇంటింటికి వెళ్లండి. ప్రభుత్వ పథకాలు పొందుతున్న వారు వైఎస్సార్ కాంగ్రెస్‌కు ఓటేయమని చెప్పండి.

వలంటీర్: అలాగే మేడమ్. తమ మాట వింటారంటే చెపుతాం.

- ఇది ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఓ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సోషల్ మీడియా కో-ఆర్డినేటర్, వలంటీర్‌కు మధ్య జరిగిన సంభాషణ. జిల్లాలో సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌లు చురుగ్గా ఉన్న చోట ఇటువంటి దందా సాగుతోంది. వలంటీర్ల ద్వారా అధికార పార్టీకి ప్రచారం చేసేలా పావులు కదుపుతున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డే పార్టీ సమావేశంలో వలంటీర్లు తమ పార్టీ కార్యకర్తలంటూ సంబోధించారు. అందుకు తగ్గట్టుగానే కొందరు సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వలంటీర్ వ్యవస్థను తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు.

వైసీపీ కార్యకర్తలుగా వలంటీర్లు!

- పార్టీ వ్యతిరేక ఓటర్లను గుర్తించాలని సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ దిశా నిర్దేశం
- అలాంటి వారి ఇళ్లకు వెళ్లి వైసీపీకి మద్దతు కోరాలి : గ్రామాల వారీగా సమీక్ష
- ఇదేం పని అంటూ అవాక్కవుతున్న ప్రజలు.. ప్రతిపక్ష పార్టీలు

ఆచంట నియోజకవర్గంలో ఓ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ పంచాయతీల వారీగా వలంటీర్లను సమావేశపరుస్తున్నట్టు తెలుగుదేశం గుర్తించింది. కొన్ని పంచాయతీల్లో ఇటువంటి సమావేశాలు నిర్వహించారు. వలంటీర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. జిల్లాలో ఇదే తరహాలో వలంటీర్లను వినియోగించేలా పావులు కదుపుతున్నారు. తమకు అనుకూలంగా లేని వలంటీర్లను తొలగిస్తున్నారు. ఒకే పంచాయతీలో ఏకకాలంలో ఇటీవల 20 మంది వలంటీర్లను తొలగించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఆదేశాలతోనే వలంటీర్లను తొలగించారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించలేదన్న ఉద్దేశంతో వలంటీర్లపై వేటుపడింది. ఇప్పుడదే నియోజకవర్గంలో వలంటీర్లను విరివిగా వినియోగించుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌లు, నాయకులను రంగంలోకి దింపుతున్నారు.

దెందులూరు సభకు రావాలంటూ ఒత్తిడి

ఇటీవల దెందులూరులో సిద్ధం సభను నిర్వహించారు. ఆ సమావేశానికి జిల్లాలోని వలంటీర్లంతా హాజరుకావాలని ఒత్తిడి చేశారు. అధికారుల నుంచి వర్తమానం పంపారు. దాంతో జిల్లా నుంచి అత్యధికమంది వలంటీర్లు సభకు హాజరయ్యారు. ఇలా ప్రభుత్వం వేతనం చెల్లిస్తూ ఎన్నికల సమయంలో పార్టీకి ఉపయోగపడేలా వలంటీర్లను వినియోగించే ప్రణాళిక చేశారు. దెందులూరు సభకు వలంటీర్ హాజరుకానట్టయితే ఇద్దరిని పంపాలంటూ ఆదేశాలు జారీచేశారు. అప్పటినుంచే పార్టీకి సానుకూలంగా ఉండేలా వలంటీర్లపై ఒత్తిడి పెంచారు. ఎన్నికల విధులకు వలంటీర్లను వినియోగించకూడదంటూ న్యాయస్థానం స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ పరంగా వారిని ఎన్నికల విధుల్లో ఉపయోగించలేదు. కానీ పార్టీ కోసం ఉపయోగపడేలా అధికార పార్టీ నేతలు వ్యూహాలు రచించారు. సంక్షేమ పథకాలను తీసుకున్న వారిపై ఒత్తిడి పెంచేలా వినియోగిస్తున్నారు.

అక్కరకురాని అర్హత పత్రాలు

వలంటీర్లను ఎన్నికలకు ఉపయోగించడం ఒక ఎత్తయితే ఇళ్ల స్థలాలు కేటాయింపులో అధికార పార్టీ నేతలు కొత్త ఎత్తులు వేస్తున్నారు. గతంలో అనర్హులంటూ తొలగించిన వారికి ఇప్పుడు పత్రాలు ఇస్తున్నారు. అవి రిజిస్ట్రేషన్ చేయడానికి పనికిరావు. ఆటువంటి పత్రాలతో లబ్ధిదారులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో ఓ పుంతలోనూ ఈ పత్రాలే ఇచ్చారు. వీఆర్వో సంతకాలతో వాటిని నివాసితులకు అందించారు. గోదావరి తీర ప్రాంత నియోజకవర్గాల్లోనూ ఈ దందా సాగుతోంది. ఒకవైపు వలంటీర్లను వినియోగించుకోవడం, మరోవైపు సంక్షేమ పథకాలు అంటూ ఓటర్లను లోబరచుకునేలా అధికార పార్టీ నేతలు పన్నాగం చేస్తున్నారు.

సర్వేలో వలంటీర్ల నిమగ్నం

వలంటీర్లను సర్వేకు ఉపయోగిస్తున్నారు. అత్తిలి, ఇరగవరం మండలాల్లో కొందరు వలంటీర్లు సర్వేకు ఉపక్రమించారు. స్థానిక అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతోనే వలంటీర్ల రంగంలోకి దిగారు. అధికార పార్టీకి అనుకూలంగా ప్రజలనాడి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. సంక్షేమ పథకాలన్నీ వలంటీర్ల ద్వారా ఎంపిక చేయడంతో వారి ప్రభావం ఓటర్లపై ఉంటుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విశ్వసిస్తోంది. ప్రజాధనంతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. వలంటీర్లకు ప్రభుత్వ సొమ్మునే వేతనాలుగా ఇస్తున్నారు. అవార్డులంటూ ప్రభుత్వం సొమ్ములు వెచ్చిస్తున్నారు. ఇప్పుడు పార్టీకి వారి సేవలను వినియోగించుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



తణుకులో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

వలంటీర్లపై ప్రత్యేక ప్రేమ!

ఇరగవరం, మార్చి 5 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ నాయకులు వలంటీర్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. నియోజకవర్గంలో పలుచోట్ల వారిని క్షేత్రస్థాయిలో ప్రచార కార్యకర్తలుగా ఇప్పటికే వాడుకుంటున్నారు. ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచనలు తెలుపుతున్నారు. రానున్న కాలంలో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెబుతూ ప్రలోభాలకు గురి చేస్తున్నారు. వలంటీర్లకు వందనం పేరుతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి వారిని ఆకర్షించుకునేందుకు తాయిలాలు అందజేస్తున్నారు. మంగళవారం తణుకులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికలలోపు ప్రతి వలంటీరు వారి పరిధిలో ఉన్న ఇంటిని కనీసం ఐదుసార్లు సందర్శించే విధంగా ప్రణాళిక చేపట్టి సీఎం జగన్ చేసిన అభివృద్ధి పనులను వివరించాలని హుకుం జారీచేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతున్న వేళ వలంటీర్లు రాజకీయ పార్టీ సమావేశాలు, కార్యక్రమాల్లో పాల్గొనకూడదన్న జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వులు అమలయ్యేనా అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

మా వల్ల కాదు !

- ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణానికి కాంట్రాక్టర్ల వెనుకంజ
- నాలుగు కొత్త ఆసుపత్రి భవనాలకు రెండుసార్లు టెండర్లు
- మూడోసారి పిలిచేందుకు కసరత్తు

భీమవరం, మార్చి 5: ఈ ప్రభుత్వంపై కాంట్రాక్టర్లకు నమ్మకం పోయింది. పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పెట్టుబడులు పెట్టి పనులు చేసిన ఎంతోమంది కాంట్రాక్టర్లు ఆర్థికంగా దెబ్బతిన్నారు. స్థానిక సంస్థలకు సంబంధించిన బిల్లులు మంజూరు అవుతున్నాయి. ఎపుడో చేసిన పనులకే బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేపట్టలేమంటూ చేతులెత్తేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రభుత్వానికి సంబంధించి టెండర్లకు కాంట్రాక్టర్లు స్పందించడం లేదు. వైద్య, ఆరోగ్య శాఖ గతేడాది జిల్లాకు నాలుగు ఆసుపత్రులను మంజూరు చేశారు. జిల్లా రహదారులు భవనాల శాఖ ద్వారా వీటికి సంబంధించి భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రెండు కోట్లు రూపాయల వంతున ఎనిమిది కోట్ల రూపాయలను మంజూరు చేశారు. పాలకోడేరు మండలం పెన్నాడ అగ్రహారంలో ఒకటి, పోడూరు మండలం గుమ్ములూరు, యలమంచిలి మండలం కలగంపూడి, మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల నిర్మాణం కోసం టెండర్లను పిలిచారు. కాంట్రాక్టర్లు ఎవరూ స్పందించలేదు. మూడు నెలల కిందట రెండో దఫా పిలిచారు. అయినా స్పందించలేదు. ఇపుడు ముచ్చటగా మూడోసారి పిలవడానికి అధికారులు కసరత్తు చేపట్టారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామీణ వైద్యసేవలు పెంచుతామని ముఖ్యమంత్రి పదే పదే చెబుతూ ఇలా ఆసుపత్రులను మంజూరు చేశారు. జిల్లాలో ఈ నాలుగు ఆసుపత్రులలో పనిచేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది వైద్యులను, సిబ్బందిని నియమించింది. ప్రతి ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లను కేటాయించారు. నాలుగు పీహెచ్‌సీలకు ఎనిమిది మంది వైద్యులను నియమించారు. భవనాలు పూర్తికాకపోవడంతో వీరంతా ఆయా మండల వైద్య ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్నందున బిల్లులు వస్తాయో ? రావో అన్న భయంతోనే ఇలా వెనుకంజ వేస్తున్నారని చెబుతున్నారు.



జాగిలాల మార్చ్‌ఫాస్ట్‌ను పరిశీలిస్తున్న ఐజీ

శిక్షణ ఎంతో ముఖ్యం

- ఐజీ జీవీజీ అశోక్‌కుమార్



ఏలూరు క్రైం, మార్చి 5 : శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు వాటిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీ డ్రిల్, వెపన్ డ్రిల్, మాబ్ డ్రిల్ ఎంతో ముఖ్యమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ఆర్ముడు రిజర్వు విభాగాల కవాత్‌లను, డ్రిల్‌ను, పోలీసు జాగిలాల మార్చ్‌ఫాస్ట్‌ను పరిశీలించారు. ఐజీకి ఎస్పీ మేరీ ప్రశాంతి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ప్రత్యేక వాహనంలో పోలీస్ పెరేడ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈవీ ఎంల ఎస్కార్ట్, ముద్దాయిల ఎస్కార్ట్, లాంగ్ ఎస్కార్ట్‌లలో సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలన్నారు. వివిధ విభాగాల పనితీరు పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎస్పీ స్వరూపరాణి, ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎస్ శేఖర్, ఎస్బీ సీఐలు మల్లేశ్వరరావు, ఆదిప్రసాద్, ఏఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్, డీసీఆర్బీ సీఐ సుబ్బారావు పలువురు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

నూజివీడు, మార్చి 5 : తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు నూజివీడు ఎస్ఈబీ సీఐ వెంకటరమణ తెలిపారు. సెబ్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాట్రాయి మండలం కృష్ణారావుపాలెంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముసునూరుకు చెందిన అనగాని కృష్ణారావును అదుపులోకి తీసుకుని 84 సీసాల తెలంగాణ మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఆక్రమణ అడ్డుకున్నాడని.. టీడీపీ కార్యకర్తపై దాడి

- వైసీపీ శ్రేణులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- ఎమ్మెల్యే పార్థసారథి ఆగ్రహం



బాధితుడు శివ నాగాంజనేయులును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, నూజివీడు టీడీపీ అభ్యర్థి పార్థసారథి

ముసునూరు, మార్చి 5 : ఏలూరు జిల్లా ముసునూరు మండలం రమణక్కపేటలో పంచాయతీ స్థలాన్ని ఓ ఆక్రమించుకుని ఇల్లు కట్టుకుంటున్న వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తపై దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని రెండున్నర సెంట్ల పంచాయతీ స్థలాన్ని వైసీపీకి చెందిన యు.శ్రీనివాసరావు ఆక్రమించుకుని ఇల్లు నిర్మిస్తుండగా టీడీపీ నాయకుడు ఉప్పే శివ నాగాంజనేయులు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై సోమవారం సాయంత్రం ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రసాద్ విచారణ చేపట్టారు. దీనికి నాగాంజనేయులును పిలిచారు. విచారణ జరుగుతుండగా శ్రీనివాసరావుతో పాటు వైసీపీ కార్యకర్తలు మరో ఐదుగురు పెదకాపు, మారేశ్వరరావు, సుబ్బారావు, పిచ్చేశ్వరరావు, శివరామకృష్ణలు తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన నాగాంజనేయులు చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రిలో చేరారు. స్టేట్‌మెంట్ రికార్డు చేసుకునప్పటికి పోలీసులు కేసు నమోదు చేయలేదు. కాని నాగాంజనేయులే తమపై దాడి చేశారని శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి వైసీపీ నాయకుల అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చికిత్స పొందుతున్న నాగాంజనేయులును ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ స్థల ఆక్రమణను అడ్డుకుంటే విచక్షణా రహితంగా దాడి చేస్తారా ? అంటూ ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడుతూ 'ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుంటే బాధ్యత గల పౌరుడిగా అడ్డుపడడం నేరమా..? పోలీసులు అధికార పార్టీ నాయకులకే కొమ్ము కాసి వారిపై కేసులు నమోదు చేయకపోవడం దేనికి సంకేతం. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని బాధితుడికి న్యాయం చేయాలి. లేకుంటే ఆందోళనకు దిగుతాం' అని పేర్కొన్నారు.

కొల్లేరులో రాజకీయ చిచ్చు

- గ్రామాల్లో వైసీపీ నాయకుల ప్రయత్నాలు
- దెయ్యంపాడులో టీడీపీ నాయకుడి కారు ధ్వంసం
- గ్రామ కూడలిలో టీడీపీ ఫ్లెక్సీ చించివేత
- టీడీపీ వైపు మొగ్గు చూపడమే కారణం : బాధిత నాయకుడు ఏడుకొండలు





దెయ్యంపాడులో ధ్వంసమైన కారు.. చించివేసిన టీడీపీ ఫ్లెక్సీ

కైకలూరు/మండవల్లి మార్చి 5 : ప్రశాంతమైన కొల్లేరు గ్రామాలు రాజకీయ కక్ష సాధింపులకు వేదికలుగా మారుతున్నాయి. సాధారణంగా కొల్లేరు గ్రామ ప్రజలు కట్టుబాట్లకు ఎక్కువ విలువ ఇస్తారు. ఈ గ్రామాల్లో పెద్దల సమక్షంలో ఎలాంటి వివాదాలైన పరిష్కరిస్తుంటారు. పోలీసులను ఆశ్రయించడం అరుదు. ఇలాంటి గ్రామాల్లో వైసీపీ రాజకీయ చిచ్చు రేపుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక బలవంతంగా కొల్లేరు గ్రామాలను సంపూర్ణ వైఎస్ఆర్ గ్రామాలుగా ప్రకటించారు. గ్రామస్థులకు ఇష్టం లేకపోయినా అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గారు. కొంత మంది తెలుగుదేశంపై ప్రేమతో ఇటీవల జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీనిని మనస్సులో ఉంచుకుని రాజకీయ కక్షతో దాడులకు తెగబడుతున్నారని అయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండవల్లి మండలం చింతపాడు శివారు దెయ్యంపాడులో సోమవారం రాత్రి టీడీపీ నాయకుడు ముంగర ఏడుకొండలు కారును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కారు వెనుక అద్దాలను, డోర్లను పగలగొట్టారు. అలికిడి విని ఏడుకొండలు ఇంటి నుంచి బయటకు వచ్చి చూడగా కారు ధ్వంసమై కన్పించింది. గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీని సైతం చింపివేశారు. దీనిపై ఏడుకొండలు మాట్లాడుతూ.. 'ఇది రాజకీయంగా కక్ష సాధించేందుకే చేశారు. మంగళగిరిలో మంగళవారం జరిగే జయహో బీసీ సభకు వెళ్లకుండా ఈ దారుణానికి పాల్పడ్డారు. ఇటీవల కొల్లేరు గ్రామాల్లో జరిగిన టీడీపీ, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆత్మీయ సమావేశాల సభలకు ఏర్పాట్లు చేయడం ఆయా పార్టీల నేతలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాను. ఈ కారణంగానే నాపై కక్ష సాధించేందుకు నా కారును ధ్వంసం చేశారు. గతంలో కొల్లేరు ఇలాంటి ఘటనలు ఎక్కడా చోటు చేసుకోలేదు. టీడీపీ వైపు నేను మొగ్గు చూపడం వల్లనే ఈ ఘాతుకానికి పాల్పడ్డారు..' అని పేర్కొన్నారు. ఈ ఘటనను గ్రామపెద్దల దృష్టికి తీసుకువెళ్లి, మండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర టీడీపీ వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే ఏసురాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఏడు కొండలుకు ధైర్యం చెప్పారు. గ్రామపెద్దలతో ఆయన మాట్లాడుతూ కొల్లేరు గ్రామ కట్టుబాట్ల మధ్య ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని, కుట్రలు, కుతంత్రాలు చేసి గ్రామాలను రెండు వర్గాలుగా వేరు చేసేందుకు ప్రయత్నాలు చేయడం తగదన్నారు. ఈ ఘటనను టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆయన తెలిపారు.

డయేరియా కలకలం

- నూజివీడులో ఒకరి మృతి
- చికిత్స పొందుతున్న పలువురు



మృతి చెందిన తాతయ్యబాబు



డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న బాధితులు

నూజివీడు టౌన్, మార్చి 5 : డయేరియా లక్షణాలతో ఓ వ్యక్తి మృతి చెందడంతో నూజివీడు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని జంగాలపేటకు చెందిన మద్దిరాల తాతయ్యబాబు (40) సోమవారం వాంతులు, విరేచనాలతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఇదే ప్రాంతంలో సుమారు 20 మంది వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నారని స్థానికులు తెలిపారు. ఎం.త్రినయని, ఎం.లక్ష్మి, పి.పుల్లమ్మ స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారిలో అత్యధికులు వయోవృద్ధులు, చిన్నారులు ఉన్నారు. వారు వ్యాధి లక్షణాలను తట్టుకోలేక మరింత నీరస పడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిపై ఆగ్రహం

తాతయ్యబాబు మృతితో జంగాలపేట, చాకలి బజార్లలో మంగళవారం సర్వేకు వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిపై స్థానికులు, ఆగ్రహం వ్యక్తంచేశారు. డయేరియా లక్షణాలతో మృతి చెందినా కనీసం వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోని పరిస్థితి ఉందని, అదేమంటే పల్స్‌పోలియో పేరు చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నా రని మండిపడ్డారు. జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చి డయేరియా లక్షణాలకు గల కారణాలను తెలుసుకునే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

9 నుంచి మూల్యాంకనం

- ఇంటర్ పరీక్షకు 435 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 5 : ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా మంగళవారం ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జిల్లాలో జనరల్ విభాగంలో 11,875 మంది, ఒకేషనల్ విభాగంలో 1,778 మంది హాజరయ్యారని, 435 మంది గైర్హాజరైనట్టు డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు. ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 9నుంచి సంస్కృతం సబ్జెక్టుతో ప్రారంభం కానుంది. ప్రధాన పరీక్షలు ఈనెల 15న ముగుస్తాయి. ఆ మరుసటి రోజు నుంచే పూర్తిస్థాయిలో మూల్యాంకనం జరుగుతుందని అధికార వర్గాలు వివరించాయి.

లోక్‌అదాలత్ 16కు వాయిదా

ఏలూరు క్రైం, మార్చి 5 : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో ఈనెల 9వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్ 16వ తేదీకి మార్చబడిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 'ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తారు. రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ దావా కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలి. ప్రతి రోజు ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో రాజీయోగ్యమైన కేసుల్లో ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వాన్ని నిర్వహించి రాజీ చేస్తున్నారు'.. అని పేర్కొన్నారు.

మాకు న్యాయం చేయండి

- గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల ధర్నా



జంగారెడ్డిగూడెం, మార్చి 5 : గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు రోడ్డెక్కారు. జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట-పంగిడిగూడెం మధ్యలో గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్ పాస్ వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం టెంటు వేసి పనులను అడ్డుకుని ధర్నా నిర్వహించారు. న్యాయమైన పరిహారం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి హైవే పనులు అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా రైతులు ఆందోళన సాగించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రైతులకు అతి తక్కువ పరిహారం ఇచ్చి బలవంతంగా భూములు లాక్కోవడం దారుణమన్నారు. ఆర్బిట్రేషన్ ద్వారా పరి హారం పెంచి ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చి విచారణ పూర్తయినా ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్స్ ఇవ్వక పోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. హైవే పనుల వల్ల దుమ్ము ధూళితో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. బోర్లు కోల్పోయిన వారికి జలకళ పథకంలో బోర్లు వేయాలని, సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, సర్వీస్ రోడ్లు బీటీ రోడ్లుగా నిర్మాణం చేయాలని, భూమి ఒకవైపు బోర్ ఒక వైపు ఉన్న రైతులకు హైవే కింద నుంచి ప్లాస్టిక్ పైపులు అమర్చాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, గ్రీన్ ఫీల్డ్ భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు గోలి నర్సిరెడ్డి, వందనపు సాయిబాబా, పి.సోమిరెడ్డి, పి.సత్తిరెడ్డి, గూడపాటి శ్రీనివాసరావు, పరిమి రామారావు, ఆలపాటి మురళి, కొట్టు కనక నరసింహారావు, పుసులూరి శ్రీహరి, పల్లి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్, రావూరి కృష్ణ, పెనుమర్తి రామ్‌కుమార్ రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

శివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

భక్తులకు ఉచిత దర్శనం


ఏర్పాట్లపై సమీక్షిస్తున్న దేవదాయ శాఖ అధికారి

భీమవరం టౌన్, మార్చి 5 : మహా శివ రాత్రికి శివాలయాల్లో అధికారులు చేస్తున్న ఏర్పాట్లను దేవదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అధికారి ఈ వెంకట సుబ్బారావు మంగళవారం పరిశీలించారు. ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. పంచారామ క్షేత్రాలైన గునుపూడిలో సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరామలింగేశ్వరస్వామి, లక్ష్మణేశ్వరస్వామి, ఆచంట రామేశ్వరస్వామి, పెనుగొండ, జుత్తిగ ఉమావాసుకీ రవిసోమేశ్వరస్వామి, నత్తారామేశ్వరం రామలింగేశ్వర స్వామి ఆలయం ఏర్పాట్లను పరిశీలించారు.

గునుపూడి సోమేశ్వరాలయంలో

భీమవరం క్రైం/టౌన్: ఈ నెల 8న శివరాత్రికి పంచారామక్షేత్రమైన గునుపూడి శివాలయంలో ముందస్తు బందోబస్తు ఏర్పాట్లను ఆలయ పరిసరాలను ఎస్పీ వి.అజిత సందర్శించారు. బ్రహ్మోత్సవాల సమయంలో శివయ్య దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంట్రీ/ఎగ్జిట్ గేట్లు, క్యూలైన్లు, అత్యవసర మార్గాలను పరిశీలించి ఇంకా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేస్తూ బ్రహ్మోత్సవాలలో ముఖ్యంగా తోపులాటకు తావు లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.


భద్రతా ఏర్పాట్లు చేస్తున్న ఎస్పీ వి.అజిత


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

భక్తులకు సౌకర్యాలు కల్పించండి

పట్టిసీమ ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్డీవో అద్దయ్య

పోలవరం, మార్చి 5 : మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య అధికారులకు సూచించారు. మంగళవారం పట్టిసీమలో భక్తులు నది దాటేందుకు ఏర్పాటుచేసిన ఫెర్రీ రేవులో అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ 500 మంది పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నామని ఉత్సవ ఏర్పాట్లలో భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, భక్తుల సౌకర్యార్థం నడకదారి ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా వాసులు నది అవతలి నుంచి వచ్చే మార్గంలో ప్రమాదాల బారిన పడకుండా ఆ జిల్లా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఉత్సవ కమిటీ చైర్మన్‌ని కోరారు. మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు ఒక క్రేన్ రెండు రికవరీ వ్యాన్లు వేన్లు సిద్ధం చేస్తున్నామని, ఆంధ్రా షుగర్స్ వాహనాలతో తాగునీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తాళ్ళపూడి నుంచి వచ్చే వాహనాలను కొత్త పట్టిసీమ నుంచి హుకుంపేట, పోలవరం చేరుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపి ట్రాన్స్‌కో ఈఈ మాట్లాడుతూ ఉత్సవంలో నాలుగు సెక్టార్లుగా ఆలయ ప్రాంగణం నుండి ఫెర్రీ రేవు వరకూ విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీరబాబు మాట్లాడుతూ మద్యం షాపులు మూసి వేస్తామన్నారు. ఆలయ ప్రాంగణం నుండి ఫెర్రీ రేవు వరకూ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి మురళీధరడ్ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ ఎం విజయరాజు మాట్లాడుతూ తమ శాఖ తరఫున ఉత్సవాలలో భక్తుల సౌకర్యార్థం పలు సేవలకు సంబంధించిన పనులు ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశం అనంతరం గోదావరి నదిపై పంట్లతో నిర్మించిన వంతెన సామర్థ్యాన్ని కాకినాడ పోర్టు అధికారులు, బోట్ సూపరిండెంట్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఐ మదుబాబు, తహసీల్దారు జీవీ ప్రసాద్, ఆలయ ట్రస్టీ కొచ్చర్లకోట జగన్నాధం, హోతా శ్రీరామచంద్రమూర్తి, ఆలయ కార్య నిర్వహణాధికారి సంగమేశ్వర శర్మ, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రాము


ఉత్సవాలకు సిద్ధమైన కేధారేశ్వర స్వామి ఆలయం

శివరాత్రికి సిద్ధమైన శైవ క్షేత్రాలు

కుక్కునూరు, మార్చి 5 : శైవక్షేత్రాలు శివరాత్రి ఉత్సవాలకి సిద్ధమయ్యాయి. కాకతీయుల నాటి పెదరవిగూడెంలోని పార్వతి సమేత కేధారేశ్వర స్వామి ఆలయం, కౌండిన్యముక్తిలోని అన్నపూర్ణ సమేత కౌండిన్యముక్తేశ్వర స్వామి ఆలయం, కుక్కునూరులోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. పెదరావిగూడెం ఆలయానికి తెలంగాణ నుంచి భక్తులు తరలిరానున్న క్రమంలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ అర్చకులు సుబ్బారావుశర్మ తెలిపారు.

రామేశ్వరస్వామి ఉత్సవాలకు సిద్ధం

ఆచంట, మార్చి5: ప్రసిద్ధ ఆచంట శ్రీ రామేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ముస్తాబు చేశామని, ఈవో రాము తెలిపారు. నేటి నుంచి 10 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెనుగొండ సీఐ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ చైర్మన్ పి.విద్యాసాగర్, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


శివయ్యను, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కుమార్తెగా చేస్తున్న అర్చకులు

శివయ్య పెండ్లికొడుకాయెనే..

అట్టహాసంగా ప్రారంభమైన కల్యాణమహోత్సవాలు

ద్వారకాతిరుమల, మార్చి 5: శ్రీవారి శేషాచలకొండపై క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో శివదేవుని దివ్య కల్యాణ మహోత్స వాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. శైవ ఆగమ యుక్త ఉత్సవాల్లో శివయ్యను పెండ్లికుమారుడిగా అమ్మవార్లను పెండ్లికుమార్తెగా చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

పాలకొల్లు రూరల్, మార్చి, 5: లంకలకోడేరు శ్రీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 8న శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. శివరాత్రి పురష్కరించుకుని జాగారం సందర్భంగా మహాలింగోద్భవ కాల అభిషేక పూర్వక లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సన్నిది శివ సుబ్రహ్మణ్యం తెలిపారు. సన్నిరాజు సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం లక్షపత్రి పూజను నిర్వహించనున్నట్లు తెలిపారు.

17న కైకలూరులో చంద్రబాబు పర్యటన

కైకలూరు, మార్చి 5: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 17న కైకలూరులో పర్యటిస్తారని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన కైకలూరులో పర్యటిస్తారని ప్రత్యేక టీంలు సభాప్రాంగణాన్ని పరిశీలిస్తాయని వివరించారు. చంద్రబాబు పర్యటన టీడీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపుతుందన్నారు.

పట్టాల పంపిణీలో నిబంధనలు బేఖాతరు

మొగల్తూరు, మార్చి5: వైసీపీ ప్రభుత్వం ఈ నెల 2న పదిమంది రైతులకు పంపిణీ చేసిన భూ పట్టాలు నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారని కాళీపట్నానికి చెందిన ప్రకాశం ల్యాండ్ పూర్ సొసైటీ అధ్యక్షుడు మేడిద మాధవ కృష్ణారావు(బాబ్జి)తెలిపారు. భూములపై ఉన్న రైతులకు జనవరి 29న నోటీసులు ఇచ్చిన సెటిల్‌మెంట్ అధికారి జేసీ ఫిబ్రవరి 17న విచారణ చేసినట్టు 29న పట్టాలు వ్రాసి మార్చి 2న రైతులకు అందించారన్నారు. పట్టాల మంజూరులో ప్రస్తుత తహసీల్దార్, ఆర్డీవోల నివేదికతో సెటిల్‌మెంట్ అధికారి జేసీ మంజూరు చేశారన్నారు. పట్టాలు మంజూరు సమయంలో నెల రోజుల ముందు పట్టాలు పొందే వ్యక్తి పేరు ఆయా గ్రామ సచివాలయ నోటీస్ బోర్డుల్లో పొందుపర్చాలని, సెటిల్‌మెంట్ అధికారికి పట్టాలు మంజూరు చేసే అధికారం లేకున్నా ఆయన హోదాతోనే పట్టాలు మంజూరు చేశారన్నారు. కాళీపట్నం భూములు ప్రభుత్వ భూములు కాగా జమిందారీ భూములుగా పట్టాల్లో పొందు పర్చారన్నారు. పట్టాలు మంజూరులో నిబంధనలకు విరుద్ధంగా అధికారులు వైసీపీ ప్రభుత్వ వత్తిడికి వ్యవహరించిన తీరుపై మంగళవారం కలెక్టర్‌కు ఫిరాదు చేశామని తెలిపారు. కాళీపట్నం భూములపై తమ సొసైటీ తరపున 80 ఏళ్ళుగా పోరాడుతున్నామని ఈ భూములు డి నమూనా పట్టాలుకింద పేదలకు అందివ్వాలన్నదే తమ పోరాటమని వివరించారు.

ఏపీ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా చౌదరి నియామకం



దెందులూరు, మార్చి 5: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను బలోపేతానికి ఏపీ ఇంచార్జి మాణిక్యం ఠాగూర్ సూచనలతో బలమైన నాయకులను నియమించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డీవీఆర్‌కే చౌదరిని నియమిస్తూ కాంగ్రెస్ ఏపీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ప్రకటించారు. ఈయన షర్మిల ఏలూరు జిల్లా, దెందులూరు నియోజక వర్గ పర్యటనను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రేపు విపత్తుల నిర్వహణపై మాక్ డ్రిల్లు

భీమవరం, మార్చి 5 : కర్మాగారాలలో రసాయన విపత్తులు జరగకుండా ముందస్తు చర్యలపై జిల్లా అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ కమాండెంట్ ఆదిత్య కుమార్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టరు ఆర్.కూర్మనాథ్ వెబ్‌ఎక్స్‌లో కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరు సుమిత్ కుమార్, ఉభయ పశ్చిమ గోదావరి జిల్లాల కర్మా గారల ఇనస్పెక్టర్ త్రినాధ్, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి యు.మంగపతిరావు, అధికారులు పాల్గొన్నారు. కాన్ఫరెన్స్‌లో ఉభయ పశ్చిమ గోదావరి జిల్లాల ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టరు ఆర్.త్రినాథరావు, జిల్లా అధికారులైన పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి మహేశ్వరరావు, పశుసంవర్థక శాఖ అధికారి మురళీకృష్ణ, సివిల్ సప్లై అధికారి యన్.సరోజ, ఆర్డబ్ల్యూఎస్ అధికారి ఏ.రామస్వామి, కార్మికశాఖాధికారి ఏ.లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికలలో ప్రతీ ఓటు కీలకం : జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

ఉండి, మార్చి 5: ఎన్నికలలో ప్రతీ ఓటు కీలకమని పోలింగ్ విధులలో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల కమిషన్ కల్పించిందని జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉండి తహశీల్దారు కార్యాలయంలో ఈ యాప్, పోస్టల్ బ్యాలెట్‌పై పాలకోడేరు మండల తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు, ఆర్ఐలతో సమావేశం నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కును వినియోగించుకునే వారికి ఫారం-12, 13ఏ, 13సీ, తదితర వాటిని సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎండీయూ వాహనాలలోని రేషన్ బియ్యాన్ని తనిఖీ చేశారు. బియ్యం, పంచదార, గోధుమపిండిలను ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, అధికారులు పాల్గొన్నారు.

బాలచందర్‌కు సేవా రత్న బిరుదు



పెనుగొండ, మార్చి 5: ప్రముఖ సాహితి సంస్థ తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక వెయ్యి రోజులు సంబరాలు జూమ్ వేదికగా నిర్వహించారు. ఐఎస్‌వో, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, లండన్ ఆఫ్ రికార్డులు సాధించి సాహిత్య రంగంలో కొనసాగుతున్న సందర్భంగా 2020 నుంచి 2024 మార్చి 1 వరకు జరిగిన కవితా పోటీల్లో వరుసగా మూడు సార్లు విజేతగా నిలిచిన బాల చందర్‌ను సేవా రత్న బిరుదుతో సంస్థ సత్కరించిందని అధ్యక్షుడు పక్కి రవి శేకర సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావు రూపకర్త కిలపర్తి దాలినాయుడు తెలిపారు. న్యాయ నిర్ణేతగా గౌరవ రాజు సతీష్ కుమార్ వ్యవహరిం చారు. అనంతరం బాల చందర్‌ను అభినందించారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెదవేగి, మార్చి 5: కాలినడకన వెళుతున్న వ్యక్తి స్పృహ తప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడు మంగళవారం మృతి చెందాడు. ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలివి.. ప్రకాష్‌నగర్‌కు చెందిన కలపాల చిన్నరాజు ఈనెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళుతూ కళ్లు తిరిగి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబసభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. విజయవాడలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

వ్యవసాయానికి 'జల సంరక్షణ'

- ఉపాధి నిధులతో పనులు.. జిల్లాలో రూ.38 కోట్ల వ్యయం
- కందకాలు, పంట కుంటల నిర్వహణ : డ్వామా పీడీ రాము,


తోటలలో కందకాలు తవ్వుతున్న కూలీలు

ఏలూరుసిటీ, మార్చి 5 : భూగర్భ జల సంపద పెంచటానికి ఉపాధి హామీలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేయటంతో రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా డ్వామా ప్రణాళిక రూపొందించింది. ఉపాధి హామీలో కేవలం చెరువులు, పంట కాల్వల పూడిక తీయటమే కాకుండా రైతులకు ఉపయోగపడే పనులను జాతీయ ఉపాధి హామీలో నిర్వహిస్తున్నారు. 18 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని రూ. 38 కోట్లు ఉపాధి నిధులతో నిర్వహిస్తున్నారు. కొబ్బరి, మామిడి, జీడి మామిడి, నిమ్మ, జామ తదితర పండ్ల తోటల్లో చెట్లకు పళ్లాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎకరానికి లక్ష రూపాయిలు ఖర్చు అవుతోందని, నిధులను ఉపాధి హామీ పథకం ద్వారా కేటాయించనున్నారు. జలసంరక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశించారని డ్వామా అధికారులు చెబుతున్నారు.

నీటి నిల్వ కోసం జల సంరక్షణ

వర్షపు నీటిని సంరక్షించుకోటానికి జల సంరక్షణ పనులు ఉపయోగపడతాయని చెబుతున్నారు. పండ్ల తోటల్లో వర్షపు నీటిని నిల్వ చేయడానికి, పంట దిగుబడికి చెట్ల పాదులు ఉపయోగపడతాయి. రైతులు స్వంతంగా పంట పాదులు ఏర్పాటు చేసుకోవాలంటే అధిక మొత్తంలో ఖర్చు అవుతుంది. పంట పాదులు ఎరువులకు అనువుగా ఉండి వేసవిలో నీటి ఎద్దడి తగ్గుతుంద న్నారు. బోర్లులో నీటి మట్టం పెరగటం వల్ల తక్కువ సమయంలో నే ఎక్కువ నీటిని వినియోగించుకోవటానికి అవకాశం ఏర్పడుతుంది.

ఉపాధి హామీలో మరిన్ని పనులు:

పథకంలో భాగంగా పండ్ల తోటల్లో, పొలం చుట్టూ కందకాలు ఏర్పాటు చేయటానికి డ్వామా శ్రీకారం చుట్టింది. మీటరు వెడల్పు, మీటరు లోతులో ఈ కందకాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎకరానికి రూ.90 వేలు ఉపాధి నిధులను కేటాయిస్తారు. మూడు సైజ్‌లలో కందకాలు ఏర్పాటు చేయటానికి కార్యాచరణ రూపొందించారు. ఈ పథకానికి జిల్లాలోని 1100 మంది రైతులు సిద్ధంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. తేమ పరిరక్షణ కోసం ఈ అడ్డుకట్టలు వేస్తున్నట్లు తెలిపారు.

- **నీటి మట్టాలు పెరుగుతున్నాయి**

రెండెకరాల మామిడితోటలో నీటి కుంట ఏర్పాటు చేసుకున్నాం. దీని వల్ల పంట చేలో వర్షపునీరు నిల్వ ఉండటమే కాకుండా బోర్లలో నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. దీంతో దిగుబడులు కూడా ఆశానజకంగా ఉండే అవకాశాలున్నాయి. ఈ పంట నీటి కుంటను ఉపాధి నిధులు రూ. 54,250 తో ఏర్పాటు చేయటం జరిగింది.

\- టి.కిషోర్‌బాబు, రైతు, బోరువంచ, నూజివీడు

- **నీటి తడులు తగ్గుతున్నాయి**

నాకు చెందిన ఎకరం 65 సెంట్లలో కొబ్బరి తోటలో చెట్లు చుట్టూ పళ్ళాలు ఏర్పాటు చేసాం. దీని వల్ల నీరు ఆదా అవ్వటమే కాకుండా వర్షపునీరు మొక్క చుట్టూ నిల్వ ఉండటం చేత పంటకు పూర్తి స్థాయిలో నీరు అందించటానికి అవకాశం ఏర్పడుతోంది. అలాగే తేమ శాతం ఎక్కువ సేపు ఉండటం వల్ల నీటి తడులు ఎక్కువగా పెట్టవలసిన అవసరం లేకుండా పోయింది. సేంద్రీయ ఎరువులు ఈ చెట్ల పళ్లాల్లో వేయటం వల్ల చెట్టు సమర్థవంతంగా పెరగటానికి , మంచి దిగుబడి ఇవ్వటానికి అవకాశం ఏర్పడింది. చెట్టు చుట్టూ పళ్ళాలను ఉపాధి నిధులు రూ. 1,75,230 తో ఏర్పాటు చేయటం జరిగింది.

\- కె.నాగరాజు, ప్రగడవరం, చింతలపూడి మండలం

పెరగనున్న భూగర్భ జల సంపద : డ్వామా పీడీ

పండ్ల తోటలలో జల సంరక్షణతో భూగర్భ జల సంపద పెరగనుంది. కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆధ్వర్యంలో ఏప్రిల్ నుంచి జలసంరక్షణ కార్యక్రమాలు నిర్వహించటానికి కార్యాచరణ రూపొందించాం. వర్షపు నీటిని ఒడిసి పట్టి బోర్లలో నీటి నిల్వల అభివృద్ధి పట్టటం వల్ల బోర్లలో నీటి నిల్వలు పెరుగుతాయి. పంట దిగుబడులు గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. విద్యుత్ ఆదా అవుతుంది. ఈ కార్యక్రమాల అమలులో రైతులు పోత్సాహం కూడా కనిపిస్తోంది. రైతుల్లో అవగాహన పెరిగితే మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తారు.

క్రైం కార్నర్

కలుపు మందు తాగి ఒకరి ఆత్మహత్య

టి.నరసాపురం, మార్చి 5 : అప్పుల బాధతో కలుపు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదైనట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి.. మక్కినవారిగూడేనికి చెందిన భాగి మంగరాజు (29) వ్యసనాలకు బానిసై చేసిన అప్పులు తీర్చలేక ఈ నెల 3వ తేదీన కలుపు మందు తాగాడు. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

అత్తిలి, మార్చి 5 : మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువకుడిని అత్యాచారం ఆరోపణపై ఫోక్సో చట్టంతో అరెస్టు చేసినట్లు అత్తిలి పోలీసులు తెలిపారు. నిందితుడు గత నెల 18వ తేదీ రాత్రి మైనర్ బాలిక నిద్రిస్తున్న గదిలోకి చొరబడి అత్యాచారం చేశాడని, తిరిగి 26వ తేదీ రాత్రి మరోసారిని అత్యాచారం చేశాడని తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన ఎస్ఐ రాంబాబు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ వాహనం దగ్ధం


దగ్ధమవుతున్న విద్యుత్తు వాహనం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 5 : తాడేపల్లిగూడెం బేబి సెంటర్ రోడ్డులో ఎలక్ట్రిక్ వాహ నం విద్యుత్తు సార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం దగ్ధమయింది. తాడేపల్లిగూడేనికి చెందిన సత్య నారాయణ విద్యుత్తు మోటారు సైకిల్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి రామారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన వీఆర్ఏ సుబ్బారావు

జంగారెడ్డిగూడెం, మార్చి 5 : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలివి.. గుర్వాయిగూడెం వీఆర్ఏగా కొదమ సుబ్బారావు మంగళవారం ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం మీసేవా కేంద్రానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో గుర్వాయిగూడెం సమీపంలో దాబా వద్దకు వచ్చే సరికి వీఆర్ఏ సుబ్బారావు వాహనం, కామవరపుకోట చెందిన జి.శ్రీనివాసరావులకు చెందిన ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. ప్రమాద ఘటన తెలుసుకున్న తహసీల్దార్ స్లీవజోజి ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు.

సెల్ ఫోన్ చోరీ.. కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 5 : కొత్త బస్టాండ్‌లో ముఠా కూలీ తన ఫోన్ పక్కన పెట్టి నిద్రపోతుండగా అపహరించాడని పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. పెదపాడు మండలం వడ్డిగూడేనికి చెందిన తురకా గోపీ ఏలూరు కొత్త బస్టాండ్‌లో ముఠా పనులు చేస్తున్నాడు. ఈ నెల 4వ తేదీ రాత్రి కొత్త బస్టాండ్‌లో డ్యూటీలో ఉండి పడుకున్నాడు. ఫోన్ తన పక్కన పెట్టుకున్నాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఓ వ్యక్తి ఈ ఫోన్ తీసుకుని పారిపోతుండగా మరో ముఠా కూలీ అతనిని వెంబడించి పట్టుకున్నారు. అతని పేరు, వివరాలు తెలుసుకుంటున్నప్పుడు పారిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫోన్ తీశానని కొట్టారు

ఏలూరు గిలకల గేటు ప్రాంతంలో కర్రిముచ్చి బాలగోపీ(36)ని భార్య వదిలి వేసింది. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఏలూరు కొత్తబస్టాండ్ సమీపంలోని బిర్యానీ కొనుగోలు చేసుకుని బస్టాండ్‌లోకి వెళ్ళి తింటుండగా ఒక వ్యక్తి వచ్చి బిర్యానీ పెట్టమన్నాడు. తను ముఠా పనివాడినని తన ఫోన్ వేరే ముఠా కూలీ పడుకున్న అతని దగ్గర ఉందని తీసుకు రమ్మని చెప్పాడని, తీసుకువచ్చి అతనికి ఇవ్వగా నేనే తీసుకుని పారిపోతున్నానని, కొంతమంది పట్టుకుని బస్సుకు కట్టేసి కొట్టారని, కాళ్లపై పెట్రోల్ పోసి కాల్చారంటూ బాధితుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. దీంతో పోలీసులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.


రావులచెరువులో మట్టి తవ్వకాలు

రావుల చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

ద్వారకాతిరుమల, మార్చి 5: రావులచెరువులో మట్టిని అక్రమార్కులు కొల్లకొట్టి సొమ్ములు దండుకుంటున్నారు. కొన్ని రోజులుగా రామన్నగూడెం పంచాయతీలోని చెరువును కొల్లగొడుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ట్రక్కు మట్టిని రూ.500 నుండి రూ.1000 వరకూ వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వారి తీరుపై పలు అనుమానాలు వెల్లువెత్తున్నాయి. రోజుకు వందలాది ట్రాక్టర్ల మట్టిని జగనన్న కాలనీల పేరుతో అక్రమంగా అమ్ముకుంటున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని పలువురు వాపోతున్నారు. తవ్వకాలకు అనుమతులు లేవని, నేతల అండదండలతో యదేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇష్టానుసారంగా చెరువును తవ్వివేస్తున్నారని, దీంతో చెరువు సహజ ఆకృతిని కోల్పోతుందని చెబుతున్నారు. తహసీల్దారు రవికాంత్ వివరణ ఇస్తూ వీఆర్వోను సంజాయిషీ కోరి తగు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

దారి లేని భవనాలకు ప్రారంభోత్సవమా ?


సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లీనిక్ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

పాలకోడేరు, మార్చి 5 : పాలకోడేరు, కొండేపూడి, పెన్నాడ గ్రామాల్లో మంగళవారం ప్రభుత్వ భవనాలను ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ప్రారంభించారు. పాలకోడేరులో కోడిగట్టును చేర్చి నాలుగున్నర ఎకరాలలో జగనన్న కాలనీని 2020లో ఏర్పాటు చేశారు. ఆ కాలనీలో ఎకరాన్నర భూమి డీఫామ్ పట్టాలుగా ఉండటంతో సంబంధిత రైతులకు పరిహారం చెల్లించకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. ఆ భూమి వివాదస్పందంగా మారి కోర్టు పెండింగ్‌లో ఉంది. మిగిలిన భూమిలో కొంత మంది ఇళ్లు కట్టుకోగా ఆ కాలనీలోనే రైతు భరోసా కేంద్రం, సచివాలయం, హెల్త్ క్లినిక్ నిర్మాణం చేపట్టారు. ఆ భవనాలకు, జగనన్న కాలనీలోనికి వెళ్లేందుకు నేటికి దారి లేకుండాపోయింది. అటువంటి భవనాలకు మంగళవారం ప్రారంభోత్సవాలు చేశారు. ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, ఉపసర్పంచ్ వెంకట్రాజు, ఉండ ఏఎంసీ ఉపాధ్యక్షుడు చేకూరి నరేంద్రవర్మ, పాల్గొన్నారు. దీనిపై ఎంపీడీవో అనూహ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా దారి సమస్యను పరిష్కరిస్తామని ప్రస్తుతానికి భవనాలను ప్రభుత్వ భవనాలుగా స్వాధీనం చేసుకునేందుకే ప్రారంభోత్సవాలు నిర్వహించామని ఆమె తెలిపారు.

పోలీస్ అధికారులతో ఎస్పీ నేర సమీక్ష

భీమవరం క్రైమ్, మార్చి 5 : ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ ప్రాంతాలను సెక్టార్‌లుగా విభజించి ప్రత్యేక అధికారులకు కార్యాచరణపై ఎస్పీ వి.అజిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సీఆర్‌పీసీ కేసులు, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, నేరస్తుల అరెస్టు, కేసుల దర్యాప్తుపై ఆరా తీసి కేసు ఫైల్స్ రికార్డ్స్‌ను పరిశీలించారు. డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వీఆర్వో సంతకం ఫోర్జరీ..

భార్య పేరున ఆరు సెంట్ల స్థలం రిజిస్ట్రేషన్
వైసీపీ నాయకుడి మోసంపై పోలీసులకు ఫిర్యాదు

పెనుమంట్ర, మార్చి 5 : పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం భట్లమగుటూరుకు చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఈది అనిత భర్త, వైసీపీ నాయకుడు ఈది ప్రవీణ్ గ్రామ వీఆర్వో సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ ప్రైవేటు స్థలాన్ని తన భార్యపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనితో వీఆర్వో జి.నాగేశ్వరి మంగళవారం రాత్రి పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని వీఆర్వోలతో కలిసి ఏఎస్ఐ వేంద్ర వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం 176/6 సర్వే నెంబరులో రైతు నుంచి ఒక ఎకరా 36 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. 48 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఆ స్థలానికి ఆనుకుని వున్న మరో ఆరు సెంట్ల స్థలాన్ని ప్రవీణ్ ఆమె భార్య పేరున వీఆర్వో సంతకం ఫోర్జరీ చేసి గత నెల 21న రిజిస్టర్ చేయించుకున్నారు. దీనికి సంబంధించి తానెప్పుడూ సర్టిఫికెట్లు ఇవ్వలేదని వీఆర్వో పేర్కొన్నారు. తన సంతకం ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఈది అనితపైన, రిజిస్ట్రేషన్ చేసిన ప్రవీణ్, సాక్షి సంతకాలు చేసిన కొల్లి చంద్రయ్య, గండి సత్యానారాయణలపై దస్తావేజు లేఖరి సత్తి సత్యనారాయణపైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.


ఈదా అనిత భర్త, వైసీపీ నాయకుడు ఈదా ప్రవీణ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వీఆర్వోలు


తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన గిరిజనులు

బుట్టాయగూడెం, మార్చి 5: భూరికార్డుల్లో తహసీల్దార్ సంతకాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ మంగళవారం అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వ ర్యంలో గిరిజనులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. వెలుతురువారిగూడెంకు చెందిన గిరిజనుల భూమి అసైన్డ్ రికార్డుల నుంచి తహసీల్దార్ సంతకాలు తొలగించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, రికార్డుల్లో డిజిటల్ సంతకం పునరుద్ధరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ డిమాండ్ చేశారు. 2007లో 1/70 భూమిని తీసుకుని అసైన్మెంట్ చేసి 74 మంది గిరిజన లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారన్నారు. భూములను అసైన్డ్ రికార్డుల్లో చేర్చి బ్యాంకుల్లో రుణాలు పొందినట్లు తెలిపారు. వారం రోజుల నుంచి అసైన్డ్ రికార్డుల్లో తహసీల్దార్ డిజిటల్ సంతకం కనిపించలేదని, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గిరిజనులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ సంతకాన్ని వెంటనే ఇవ్వకపోతే ఇక్కడి నుంచి వెళ్లేదిలేదని తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు బైఠాయించారు. విషయం తెలుసుకున్న తహసీలార్ వెంకటేశ్వర్లు కార్యాలయానికి చేరుకుని రెండు రోజుల్లో డిజిటల్ సంతకాన్ని ఇస్తానని హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆందోళన విరమించారు. అనంతరం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వెట్టి సుబ్బన్న, ఎస్.రామ్మోహన్, జి.పోతురెడ్డి, టి.బాబురావు, వెట్టి భారతి, ఎంపీటీసీ కొవ్వాసు గోవిందరాజు, ఈ.భూషణం, బి.వినోద్, బాషా రంపాలరాజు, డి.అర్జునుడు, న్యాయవాది బాషా శ్యాంబాబు, నాగమ్మ, చిలకమ్మ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ఆయాలు, స్వీపర్ల ధర్నా


వినతిపత్రం అందజేస్తున్న ఆయాలు, స్వీపర్లు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 5: ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, స్వీపర్లు వేతన బకాయిల కోసం ఆందోళన చేపట్టారు. పెండింగ్‌లో వున్న వేతన బకాయిలు చెల్లించాలని, వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ పాఠశాలల ఆయాలు, స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు, మద్దాల దుర్గ, డేగల భవాని మాట్లాడుతూ 9 ఏళ్లుగా పాఠశాలల ఆవరణ, టాయిలెట్లను శుభ్రం చేస్తున్నామని, ఇప్పటికీ నెలకు కేవలం రూ.6వేలు వేతనం మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వందల సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలల్లో ఆయాలపై భారం పడుతోందని, అనారోగ్యంవస్తే సెలవులు వర్తింపజేయడం లేదన్నారు. ప్రతీ వంద మంది విద్యార్థులకు ఒక ఆయా వంతున నియమించాలని, నెలలో ఒకరోజైనా మెడికల్ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2015 నుంచి పనిచేస్తున్నవారిని విధుల్లో కొనసాగించాలని కోరారు. డీఈవో అబ్రహంకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ నాయకులు చంద్ర, నాగలక్ష్మి, జి.కుమారి, వెంకాయమ్మ, రాద తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థి ట్యాబ్ పరిశీలిస్తున్న ఏపీసీ సోమశేఖరరావు

పెదపాడు, మార్చి 5: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష ఏపీసీ బి.సోమశేఖరరావు అన్నారు. పెదపాడు జడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాబోధన, పాఠశాల పరిసరాలు, టాయిలెట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 27 పాఠశాలలు ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్‌కు ఎంపిక కాగా అందులో పెదపాడు ఉన్నత పాఠశాల ఒకటన్నారు. ఆయా పాఠశాలల్లో ప్లేగ్రౌండ్ లెవెలింగ్ కోసం సుమారు రూ.80 లక్షల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు పనిచేయాలని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఏఎంవో రెడ్డి రామారావు, హెచ్.ఎం. పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పనవీడు హైస్కూల్ ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

పెదపాడు, మార్చి 5: అప్పనవీడు జడ్పీ హైస్కూల్‌ను డీఈవో ఎస్.అబ్రహం మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించగా 8వ తరగతి విద్యార్థులకు గణితం సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయలేదని గుర్తించారు. గణితం ఉపాధ్యాయుడు ఎ.విజయసారధికి షోకాజ్ నోటీసు జారీ చేసి, హెచ్ఎం టి.పుష్పావతిని వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కలపర్రు హైస్కూల్‌ను తనిఖీ చేసి బైజూస్ వినియోగాన్ని పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవోలు సబ్బితి నరసింహమూర్తి, దేవినేని వెంకటరమణ, జిల్లా నోడల్ అధికారి శ్రీహరి, కలపర్రు హెచ్ఎం. కె.భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు


డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎంవీఐ

పోలవరం, మార్చి 5: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం ఎంవీఐ ఎం.మదాని హెచ్చరించారు. పోలవరం పంచాయతీ వద్ద ఆటో కార్ డ్రైవర్ యూనియన్ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని, అనుమతించిన పరిధి మేరకే ఆటోలు నడపాలని సూచించారు. కేవీ.శివప్రసాద్ మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, అధిక చార్జీలు వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో, కార్ సంఘ నాయకులు డ్రైవర్లు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సాలో మహిళా దినోత్సవం


శారదా దేవిని సత్కరిస్తున్న అధికారులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 5: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, సెట్వెల్ సంయుక్త ఆధ్వర్యంలో సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో మంగళవారం మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదాదేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కళాశాల విద్యార్థినుల ఏకపాత్రాభినయం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫ్యాన్సీ డ్రెస్, నృత్యపోటీలు జరిగాయి. ప్రిన్సిపాల్ మెర్సీ, యువజన సర్వీసుల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ స్టీవెన్, సెట్వెల్ సీఈవో మెహర్రాజ్, నేషనల్ కెరీర్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్‌కృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ క్రిస్టియా మరియా, సిస్టర్ సుశీల, పద్మావతి, నిర్మలజ్యోత్స్న పాల్గొన్నారు. కమిషనర్ శారదాదేవిని, ప్రిన్సిపాల్, అధ్యాపకులను సన్మానించారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన సదస్సు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 5: మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం గాంధీనగర్‌లోని హైస్కూలులో 8, 9 తరగతుల విద్యార్థినులకు ఐసీడీఎస్ సీడీపీవో ఎ.పద్మావతి బాలల హక్కులు, మహిళా చట్టాలు తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. బేటీ పడావో-బేటీ బచావోపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు వచ్చేవిధంగా వ్యవహరించాలని సూచించారు. అంగనవాడీ సూపర్‌వైజర్ బి.మంగ, మహిళా సంరక్షణ అధికారి కె.వి.నాగమణి, అంగన్‌వాడీ జి.వెంకటలక్ష్మి, కార్యకర్తలు ఎం.నవతి, ఎన్.వెంకటలక్ష్మి, జె.రాధ, ఐ.రాజేశ్వరి, ఎ.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా దినోత్సవ కార్యక్రమాలు

ఏలూరు కలెక్టరేట్, మార్చి 5: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఎన్జీవోస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమాలు బుధవారం నిర్వహించనున్నారు. ఐసీడీఎస్ పీడీ ఏపీఎల్ పద్మావతి మంగళవారం వివరాలు తెలిపారు. ఇరిగేషన్ శాఖ కార్యాలయం వద్ద క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సురేష్‌చంద్రబహుగుణ స్కూల్ కాంపౌండ్, పోలీస్ కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆమె కోరారు.


ర్యాలీ ప్రారంభించిన చింతమనేని ప్రభాకర్


చింతలపూడి నుంచి జయహో బీసీ సభకు వెళుతున్న నేతలు


ఏలూరులో ఆటోడ్రైవర్లతో బడేటి చంటి


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రోషన్‌కుమార్

తెలుగుదేశం పార్టీ పాలనలోనే

బీసీ సంక్షేమం

జయహో బీసీ సభకు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

పెదవేగి / పెదపాడు, మార్చి 5: బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని చింతమనేని ప్రభాకర్ అన్నారు. బీసీ సాధికారతకు టీడీపీ కట్టుబడి ఉందన్నారు. గుంటూరులో మంగళవారం జరిగిన జయహో బీసీ సదస్సుకు బయలుదేరిన కార్లకు హనుమాన్ జంక్షన్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. బీసీలు టీడీపీకి వెన్నెముక అన్నారు. బీసీ సాధికారతే లక్ష్యంగా టీడీపీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. వైసీపీ అరాచకాలు, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డికి సినిమా చూపించడం ఖాయమని తెలిపారు. టీడీపీ, జనసేన కూటమితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే నమ్మకం ప్రజల్లో వచ్చిందని, కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రం పురోగమనం దిశగా అడుగులు వేస్తుందని ప్రభాకర్ పేర్కొన్నారు.

● చింతలపూడి: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు పార్టీకి అండగా నిలుస్తున్నారని జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘ సాధికారత కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు అన్నారు. చింతలపూడి నియోజకవర్గం నుంచి జయహో బీసీ సదస్సుకు ప్రగడవరం నుంచి తరలివెళ్లారు. సభలో జాతీయ నేత చంద్రబాబు నాయుడు బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ కె.వీర్రాజు, సీహెచ్.మారేశ్వరరావు, ఆర్.రాంబాబు, కాగిత రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీసీ నాయకులు జయహో బీసీ సదస్సుకు తరలివెళ్ళారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మాజీ జడ్పీటీసి ఘంటా సుధీర్‌బాబు, సర్పంచ్‌లు వేముల నాగేశ్వరరావు, గూడపాటి కేశవరావు, గోరింక దాసు, పసుమర్తి పార్ధసారధిబాబు, జిజ్జూరి బాబ్జీ బృందం, మండల జనసేన కన్వీనర్ ఎస్‌కె.వలీ బృందం మంగళగిరికి పయనమయ్యారు.

● జంగారెడ్డిగూడెం: జయహో బీసీ సభకు టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, కొప్పెర్ల నాగరాజు జెండా ఊపి వాహనాలు ప్రారంభించారు. కొనకళ్ల రాజు, మరీదు రవితేజ, చుక్కా సూర్యప్రకాష్, ఉలాస వెంకట సుబ్బారావు, నాగేశ్వరావు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: జయహో బీసీ సభకు టీడీపీ నాయకులు తరలి వెళ్లారు. ములగలంపల్లి, పి.అంకంపాలెం, రాచన్నగూడెం గ్రామాల నుంచి బీసీ నాయకులు వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుంకల్లి సాయి, నాలి శ్రీను, తోట బాలు, వనమ వెంకటేశ్వరావు, మామిళ్ల వెంకట్రావు, మరీదు పండు, నల్లాపు దుర్గారావు, పేరుబోయిన దుర్గారావు, పేరుబోయిన దాము ఉన్నారు.

జన సేన, టీడీపీ విజయం తథ్యం

ఏలూరు టూటౌన్: టీడీపీ, జనసేన కూటమి విజయం తథ్యమని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాలా బాలాజీ అన్నారు. 3వ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించి సూపర్ 6 పథకాలను ప్రజలకు వివరించారు. జనసేన, టీడీపీ పొత్తు గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని జగన్ చిన్నాభిన్నం చేశారన్నారు. పరిపాలన చేతకాక జగన్ రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీ శారన్నారు. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. జాలా సుమతి బాలాజీ, షేక్ రిజ్వాన పాల్గొన్నారు.

మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని జగన్ భ్రష్టు పట్టించాడని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 46వ డివిజన్‌లో ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. చంద్రబాబు, పవన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని అన్నారు. మల్లెపు రాము, ఈదుపల్లి రామ్‌లక్ష్మణ, తాతారావు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్న జగన్‌ను సాగనంపేందుకు అన్ని వర్గాలు సిద్ధంగా ఉన్నాయని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. పవర్‌పేటలో గుబ్బల మంగమ్మ తల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మట్లాడుతూ టీడీపీ, జనసేన కూటమికి ప్రజలు సంపూర్ణమద్దతు తెలుపుతున్నారని అన్నారు.

● లింగపాలెం: బాదరాల, ఆసన్నగూడెం గ్రామాల్లో గరిమెళ్ళ చలపతి రావు, సర్పంచ్ బొల్లినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం సూపర్‌సిక్స్ పథకాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సొంగా రోషన్‌కుమార్ గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. బొల్లినేని శ్రీను, మాదా వెంకట్రావు, రాధాకృష్ణ, గోవర్ధన్‌రావు, కృష్ణ, మామిడిపల్లి శ్రీను, యర్రా శ్రీను, తాతా సత్యనారాయణ, పలువురు గ్రామస్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా కలిసి పనిచేద్దాం

చింతలపూడి: ప్రగడవరంలో తెలుగుదేశం, జనసేన నియోజకవర్గ నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. విజయమే లక్ష్యంగా కలసి పనిచేద్దామంటూ నాయకులు ప్రకటించారు. సమావేశంలో టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుని విజయం సాధించాలని, అధికారంలోకి వస్తే కష్టపడిన వ్యక్తులకు తెలుగుదేశంతోపాటు జనసేనకు నామినేటెడ్ పదవుల్లో సమానంగా ఉంటుందని ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు. ప్రచారంపై ఈనెల 10న కార్యాచరణ రూపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకా ఈశ్వరయ్య, మండల అధ్యక్షుడు చీదరాల మధుబాబు, టీడీపీ నాయకులు టి.చంద్రశేఖరరెడ్డి, కె.రాజశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేతలను కలసిన రోషన్ కుమార్

జంగారెడ్డిగూడెం: చింతలపూడి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ నేతలను కలసి ఎన్నికల్లో సహకరించాలని కోరుతున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పట్టణంలో పేరిచర్ల జగపతి రాజు, కర్పూరం నారాయణరావు, నడింపల్లి సత్యనారాయణ రాజు, చీమకుర్తి కోటేశ్వరరావు, గొట్టుముక్కల వంశి, కేసనపల్లి సీతారామయ్య బ్రదర్స్, తడికమళ్ళ రామకృష్ణారావు, వాసా రామలింగేశ్వరరావు తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని అభ్యర్థించారు. ఆయన వెంట రావూరి కృష్ణ, తూటికుంట రాము, పెనుమర్తి రామకుమార్, నంబూరి రామచంద్ర రాజు, కంచర్ల గణేష్ కుమార్. బేతాళ మురళీకృష్ణ, గుళ్ళపూడి రమేష్, పీసుపాటి అభిరామ్, నాయుడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి


రాజకీయ నేతలతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి

చింతలపూడి, మార్చి 5: ఎన్నికలు సజావుగా సాగడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని చింతలపూడి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, పోలవరం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ల వివరాలు, ఓటర్ల వివరాలు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల కోసం ఏర్పాటు చేస్తున్న హోం ఓటింగ్ వివరాలను వెల్లడించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు జానకీరెడ్డి, నీరజ, ఆర్‌వీవీ.రామారావు, జగ్గవరపు ముత్తారెడ్డి, ఎం.వెంకట్రామయ్య టీవీ.నారాయణ, డి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

బుట్టాయగూడెం: ఐటీడీఏ సమావేశ మందిరంలో పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పీవో ఎం.సూర్యతేజ ఎన్నికల అధికారులు, సిబ్బందికి వివిధ అంశాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సాధారణ ఎన్నికల నిమిత్తం నామినేషన్లు, ఉపసంహరణ, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించి ఎన్నికల విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఎస్‌డీసీ, తహసీల్దార్లు, ఎలక్షన్ టీమ్, నామినేషన్ టీమ్‌లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

లింగపాలెం: యడవల్లి, సింగగూడెం, తోచిలుక గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పోలింగ్ అధికారులు పరిశీలించారు. రూట్ ఆఫీసర్ జగన్నాథరావు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సదుపాయాలపై ఆరా తీశారు. పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలన్నారు. అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

భూసార పరీక్ష శిక్షణపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం, మార్చి 5: ఆహార పంటలకు అధిక దిగుబడికి కావలసిన పోషకాలను భూసార పరీక్షతో గుర్తించవచ్చని అధికారులు తెలిపారు. భూసార పరీక్షలపై విద్యార్థులకు కేఆర్.పురం ఏడీఏ పీజీ.బుజ్జిబాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఏకలవ్య రెసిడెన్సియల్ స్కూల్లో మంగళవారం 7, 8 తరగతుల విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. డీఆర్సీ అసిస్టెంట్ డైరెక్టర్ పి.లలితా సుధ భూమిలో పోషకాలు, లవణాలు లభ్యతలను వివరించారు. సైంటిస్టు ఎం.రాఘవేంద్రరెడ్డి భూసార పరీక్షకు మట్టి సేకరణ విధానం, జాగ్రత్తలును వివరించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా 9 మందిని ఒక గ్రూపు చొప్పున 5 గ్రూపులుగా చేసి మట్టి నమూనా సేకరణ, పరీక్షా కేంద్రాలకు పంపించే విధంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బి.సోమశేఖర్, పి.వెంకటరామయ్య, బి.సుమలత వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

చింతలపూడి, మార్చి 5: ఏపీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని నాగిరెడ్డిగూడెం గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం.బ్రహ్మణీశ్వరమ్మ మంగళవారం తెలిపారు. అప్పలరాజుగూడెం, నాగిరెడ్డిగూడెం, ముసునూరు గురుకులాల్లో ప్రవేశానికి ఏప్రిల్ 25న పరీక్ష జరుగుతుందన్నారు. వివరాలకు 8712625031 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాంకేతిక ఉపాధి అవకాశాలు

పెదపాడు, మార్చి 5 : ఐటీఐ విద్యార్థులకు సాంకేతిక ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. వట్లూరు ఐటీఐలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. పద్మశ్రీ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో నిరంతరం నూతన సాంకేతిక అంశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు 99.5శాతం పూర్తి

పెదవేగి, మార్చి 5: మండలంలో పోలియో చుక్కలు 99.5శాతం పూర్తి చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పూర్ణిమ మంగళవారం తెలిపారు. మొత్తం 6438మంది చిన్నారులకు 6407మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని ఆమె చెప్పారు. మిగిలిన వారు గ్రామాంతరం వెళ్లారని ఆమె వివరించారు.

గ్రామ సహాయకుల నిర్బంధంపై నిరసన

భీమడోలు, మార్చి 5: సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ సహాయకులు చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు నిర్బంధించడంపై సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ.ప్రసాద్ ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలు రెండు నెలల్లో పెట్టుకుని కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై నిరంకుశంగా వ్యవహరించడం, మాట్లాడే హక్కును హరించడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నామని చెప్పడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలు తక్షణమే విరమించాలని డిమాండ్ చేశారు. నిడమర్రు మండలంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు నారపల్లి రమణారావు, జీలుగుమిల్లిలో వీఆర్ఏ జిల్లా కార్యదర్శి చంద్రశేఖరర్, అధ్యక్షుడు బ్రహ్మాజీ, భీమడోలులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజును పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి నిర్బంధించడంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

ఏజెన్సీ ప్రాంత సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు టూటౌన్, మార్చి 5: ఏజెన్సీ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం రవి మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న ఏజెన్సీ బంద్ విజయవంతం చేయాలన్నారు. అంతకుముందు ఈ నెల 8, 9తేదీల్లో ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆదివాసి జనరక్షణ దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులకు స్పెషల్ డీఎస్సీ విడుదల చేయాలన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వాలన్నారు. అటవీభూముల చట్ట సవరణ రద్దు చేయాలన్నారు. పోడుభూములకు పట్టాలివ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీలు ఐదేళ్లయినా నెరవేర్చలేదన్నారు.

'ఇగ్నో' కోర్సులపై అవగాహన సదస్సు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 5: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో వివిధ డిగ్రీ, పీజీ, సర్టిఫికెట్, డిప్లమో కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థులకు అవగాహన సదస్సు మంగళవారం సీఆర్‌ఆర్ కళాశాలలో జరిగింది. 'ఇగ్నో' విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఇ.కృష్ణారావు మాట్లాడుతూ నూతన విద్యావిధానానికి అనుగుణంగా ఇగ్నోలో నాలుగేళ్ళ డిగ్రీ కోర్సులను ఈ ఏడాదినుంచే అందుబాటులోకి తెచ్చామన్నారు. కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు నైపుణ్యంతోపాటు, వృత్తి విద్యాశిక్షణ, ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. ఆయా కోర్సులకు లభించే రాయితీల గురించి తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామరాజు, ఇగ్నో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోండి..


మస్తాన్ మన్యం కాలనీ రోడ్డులో ధ్వంసమైన సీసీ రోడ్డు


ఏసుపాదపురం – హెల్త్ సెంటర్ రోడ్డులో మూత లేని డ్రెయినేజీ

● నగరంలో ధ్వంసమైన రహదారులు.. ● ప్రమాదకరంగా డ్రెయినేజీలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 5: నగరంలో పలు రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. ధ్వంసమైన రహదారులు మరమ్మతు చేయిస్తే నగర ప్రజలు ప్రమాదం నుంచి బయటపడతారు. పాలకులు అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు తప్పడం లేదు. స్థానిక విజయలక్ష్మి థియేటర్ నుంచి మస్తాన్‌మన్యం కాలనీ రహదారిలో మురుగు కాలువ వంతెన వద్ద సీసీ రోడ్డు దెబ్బతింది. రాత్రివేళల్లో రాకపోకలు సాగించేవారు ఈ ప్రాంతంలో ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు విరిగి ఉండడం, పక్కనే డ్రెయిన్ ఉండడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నాలుగో డివిజన్‌లోని ఏసుపాదపురం నుంచి హెల్త్ సెంటర్ రహదారిలో నాలుగు రోడ్ల కూడలి వద్ద రోడ్డు మధ్య డ్రెయినేజీ స్లాబ్‌లు పక్కన పెట్టారు. నెల రోజులుగా వాటిని అలాగే ఉంచారు తప్ప డ్రెయినేజీ శుభ్రం చేయలేదు. ఆ మూతలు వేయలేదు. దీంతో స్థానికులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు మధ్యలో డ్రెయినేజీ మూత లేకపోవడంతో వాహనదారులతోపాటు నడిచి వెళ్లే వారు సైతం పడిపోతున్నారు. పాలకులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. చిన్నపాటి పనులు చేయకపోతే ఎలా అంటూ ఆయా ప్రాంతాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

అడవుల్లో అగ్రి ప్రమాదాలు నివారించాలి

పోలవరం, మార్చి 5: వేసవిలో అడవుల్లో అగ్ని ప్రమాదాలను నివారించాలని అటవీశాఖ ఉప డివిజన్ అధికారి వెంకట సుబ్బయ్య అన్నారు. పోలవరం అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం 'అడవికి నిప్పు, భవితకు ముప్పు' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవులను కాపాడడం అటవీ సిబ్బంది బాధ్యత అన్నారు. అడవుల్లోకి అగ్గిపెట్టెలు, నిప్పు రగిలించే వస్తువులు తీసుకెళ్లడం నేరమని, సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచి అడవుల్లో అగ్నిప్రమాదాలను నివారించాలని సూచించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రకృతి పరంగా జరిగే అగ్ని ప్రమాదాలు, ఉద్దేశపూర్వక అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదురాజు అటవీశాఖ రేంజ్ అధికారులకు సిబ్బందికి అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. సిబ్బంది కె బాబూరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మిడిలో శక్తి వందన్ అభియాన్

ఉంగుటూరు, మార్చి 5: మండలంలోని బొమ్మిడిలో మంగళవారం శ్రేణులు శక్తి వందన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నియోజకవర్గ ఇన్‌చార్జి శరణాల మాలతీరాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అడపా శోభారాణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

జనసేన బలోపేతానికి కృషిచేయాలి

ఏలూరు రూరల్, మార్చి 5: జనసేన పార్టీ సిద్ధాంతాలను పవన్‌కల్యాణ్ ఆశయాలను, భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు మరింతగా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి కోరారు. పార్టీని బలోపేతం చేసే దిశగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు ఆదేశాల మేరకు దెందులూరు నియోజకవర్గంలో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. నాలుగు మండలాలకు ఎన్నికైన సమన్వయ కమిటీ సభ్యులంతా దెందులూరు నియోజకవర్గంలో జనసేనపార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని ఆమె సూచించారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కామవరపుకోట, మార్చి 5: ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు భారతాల రమేష్ ఎబిసిడి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ తమ బృందం రాష్ట్ర హోం శాఖా మంత్రి తానేటి వనితకు వినతిపత్రాన్ని అందచేసినట్టు తెలిపారు. మంగళవారం రమేష్ మాట్లాడుతూ ఇటీవల ద్వారకాతిరుమల మండలంకు మంత్రి విచ్చేసిన తరుణంలో తమ గ్రామానికి చెందిన ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు దర్శనం యేసుబాబు, భారతాల వరప్రసాద్, పి.రమేష్, కొత్తపల్లి నాగరాజు, నాగేంద్రరావుల బృందం కలుసుకుని ఈ మేరకు తమ సమస్యలను తెలియచేసి ఎబిసిడి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, అందుకోసం సహకరించాలని కోరామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** అగ్రహారంలోని రామకోటి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శాంతనగర్‌కు చెందిన అభయ ఆంజనేయ భక్త సమాజం మహిళలు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. బుధవారం సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.
- **ఏలూరు రూరల్ :** శనివారపుపేట జింగిల్‌బెల్స్ పాఠశాలలో సైన్స్, ఆర్ట్ ఎక్స్‌పో ముగిసింది. యూకేజీ విద్యార్థులకు స్నాతకోత్సవం, కిండర్ గార్డెన్ కాన్వకేషన్ నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జ్ బడేటి చంటి విద్యార్థులకు స్నాతకోత్సవ పత్రాలను అందజేశారు. ఈ.సురేష్, కె.విజయలక్ష్మి, లయన్స్‌క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** కాలు, చెయ్యి, వెన్నెముక విరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబానికి డాంగేనగర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు సాయం అందించారు. పురాలశెట్టి సూర్యనారాయణ ఇటీవల కూలి పనికి వెళ్లినప్పుడు ఇంటి పైకప్పు కూలడంతో గాయపడ్డాడు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేశారు. అమృతల రంగా, నేలపోలు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.
- **భీమడోలు :** జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 3040 లబ్ధిదారులు ఉండగా 2523 మందికి రిజిస్ట్రేషన్ చేసినట్లు 2136 మందికి పట్టాలు పంపిణీ జరుగుతుందని వాసుబాబు తెలిపారు. జడ్పీటీసీ భవానీ, ఏఎంసీ చైర్మన్ నీలిమ, సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్ పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** కైకరం ఆరుగుళ్ళ సెంటర్‌లో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఊరేగింపు నిర్వహించారు. కామాక్షి విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న కల్యాణోత్సవాలలో భాగంగా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
- ఉంగుటూరు మండలం నారాయణపురం ప్రిజమ్ జాన్సన్ పరిశ్రమలో వాయు విపత్తుపై గురువారం మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఏ.శ్రీనివాస్ తెలిపారు.
- ఉంగుటూరు కమ్మ కల్యాణ మండపంలో ఇళ్ల స్థలాల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే వాసుబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పీటీసి కొరిపల్లి జయలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



నూజివీడు నుంచి జయహో బీసీ సభకు వెళ్తున్న టీడీపీ నాయకులు



మంగళగిరి సదస్సుకు తరలి వెళుతున్న చాట్రాయి టీడీపీ శ్రేణులు



ముదినేపల్లి నుంచి బీసీ సదస్సుకు తరలిన నాయకులు



ఆగిరిపల్లి మండలం తోటపల్లి నుంచి వెళ్తున్న నాయకులు



కలిదిండి నుంచి ర్యాలీగా వెళ్తున్న టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు

జయహో బీసీ

మంగళగిరి సభకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

నూజివీడు, మార్చి 5: జయహో బీసీ సభకు నూజివీడు టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్ళాయి. మంగళవారం గుంటూరు జిల్లా నాగార్జున వర్సిటీ సమీపంలో నిర్వహిస్తున్న సభకు ఎమ్మెల్యే, నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు వరలక్ష్మి, గోళ్ళ లోకేశ్వరరావు, తుమ్మల ఆది, దేవినేని కిషోర్ తదితరులు ఉన్నారు.

చాట్రాయి: మంగళగిరిలో జయహో బీసీ సదస్సుకు చాట్రాయి మండలం నుంచి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్ళారు. సదస్సుకు బయలుదేరిన కార్ల ర్యాలీని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొలుసు పార్థసారథి, పార్టీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు సదస్సులో ప్రతిపాదించే బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు రక్షణతో పాటు అన్ని రంగాల్లో సముచిత స్థానం ఉంటుందన్నారు. టీడీపీకి బీసీలే వెన్నుముక అని, రానున్న ఎన్నికల్లో బీసీలు తెలుగుదేశం, జనసేన కూటమిని భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు సదస్సుకు వెళ్ళారు.

ముదినేపల్లి: గుంటూరు జిల్లా నాగార్జున వర్సిటీ ఎదురుగా మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ సదస్సుకు ముదినేపల్లి మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శులు పరసా విశ్వేశ్వరరావు, పరసా ఏడుకొండలు, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు, బొంగు రవికుమార్ తదితరుల నాయకత్వంలో మండలం నుంచి పార్టీ కార్యకర్తలు తరలివెళ్లి సదస్సులో పాల్గొన్నారు. పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడిగా విడుదల చేసిన బీసీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేశారు.

కలిదిండి: మంగళగిరిలో నాగార్జున వర్సిటీ సమీపంలో మంగళవారం నిర్వహించిన జయహో బీసీ బహిరంగ సభకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు కార్లు, బైకులపై భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి టీడీపీ జెండా ఊపి కార్లు, బైక్‌ల ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంద్రాజు శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని రాబోయే ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా టీడీపీ విజయానికి సహకరించాలన్నారు. వైసీపీ బీసీలను అన్ని విధాలా అణచి వేయడమే గాక అవమానాల పాలు చేసిందన్నారు. బీసీలకు గత చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన 34 రకాల పథకాలను సీఎం జగన్ అధికారంలోకి రాగానే అటకెక్కించారన్నారు. బీసీలకు అన్యాయం చేసిన జగన్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గూడవల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర రజక సాధికార కమిటీ సభ్యుడు లంకా రత్నారావు, నాయకులు వాకాని కోటేశ్వరరావు, సంగాని గంగాధరరావు, చేబ్రోలు శ్రీనివాసరావు, పరసా మురళీ, నున్న అనిల్, గంగుల పైడియ్య, సంగాని రామకృష్ణ, కొల్లాటి గోపాలం, తిరుమలశెట్టి పరశురాముడు, పొనమండ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జూదం

అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే?

ముదినేపల్లి రూరల్, మార్చి 5: మండలంలోని కోమర్రు, కాకరవాడ శివారు దేవరం గ్రామంలో కాల్వగట్ల వెంబడి వారం రోజులుగా జోరుగా పేకాట నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో జూదం జరుగుతోందని, పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో పేకాట నిర్వహిస్తున్నా పోలీసులు కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బంటుమిల్లి, కలిదిండి, పెడన, గుడివాడ తదితర ప్రాంతాల నుంచి భారీగా జూదరులు వచ్చి ఆటల్లో పాల్గొని జేబులు గుల్ల చేసుకుంటున్నారు. పోలీసుల అనుమతులు ఉన్నాయని ప్రచారం చేయడంతో నిత్యం అధిక సంఖ్యలో జూదరులు పాల్గొంటున్నారు. పెడనకు చెందిన అధికార పార్టీ నాయకుడు ముదినేపల్లి ప్రాంతంలో జూద శిబిరం నిర్వహిస్తుండటం గమనార్హం. ఈ ప్రాంతంలో జూదం నిర్వహించటంపై అధికార పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రాస్తారోకో చేయటానికి సిద్ధపడగా సదరు నాయకుడిని అదే పార్టీలో నాయకులు సముదాయించినట్లు సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరగా జూదాలకు ఎలాంటి అనుమతులు లేవని, నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు అందితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై వెంకట్‌కుమార్ పేర్కొన్నారు.

పోలవరం ప్రాజెక్టుకు బీజేపీ బైక్ ర్యాలీ



చాట్రాయి, మార్చి 5: పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఆయకట్టుకు నీరివ్వాలని కోరుతూ మండల బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం చాట్రాయి హనుమాన్ విగ్రహం నుంచి పోలవరం ప్రాజెక్టుకు బైక్ ర్యాలీగా నాయకులు తరలి వెళ్ళారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ సుమారు 25 ఏళ్ళ క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అగ్ర నాయకుడు ఇంద్రసేనారెడ్డి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని కోరుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశం నుంచి చాట్రాయి మీదుగా విజయవాడ కృష్ణా నది వరకు పాదయాత్ర చేశారని, అదే మార్గంలో ఇప్పుడు బైక్‌ర్యాలీ చేపట్టామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కె. ముత్తారెడ్డి, నాయకులు ఏఎస్ఎం శర్మ, చెన్నారావు, శ్రీకర్, అజయ్, కేశవ తదితరులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

పూత రాకముందే తెగుళ్ళు నివారించాలి

కైకలూరు, మార్చి 5: మినుము పంటలో పూతకు ముందే చీడపీడల నివారణ చర్యలు చేపడితే పురుగు ఉధృతిని తగ్గించవచ్చని ఏలూరు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి ఎం. ఉషాకుమారి అన్నారు. మంగళవారం గోపవరంలో స్థానిక వ్యవసాయ శాఖాధికారులతో కలసి మినుము పంటను పరిశీలించారు. పంటలో మరకమచ్చల పురుగు, బూడిద తెగులు ఎక్కువగా ఉందన్నారు. పూత వచ్చే సమయంలోనే వ్యవసాయ శాఖాధికారులను సంప్రదించి ముందస్తుగా మందులను పిచికారీ చేస్తే వాటి ఉధృతి తగ్గుతుందన్నారు. అనంతరం ఆర్బీకేలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ క్రాప్ జాబితాను గ్రామాల్లో ప్రదర్శించామని అభ్యంతరాలుంటే వీఏఏల దృష్టికి తేవాలని, తుది జాబితాను ఈ నెల 7న ఇవ్వనున్నట్లు తెలిపారు. కైకలూరు మండల వ్యవసాయాధికారి ఆర్. దివ్య, సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, వీఏఏ జి. ధర్మతేజ, రైతులు పాల్గొన్నారు.

యువకుడిపై మూకుమ్మడి దాడి

కలిదిండి, మార్చి 5 : యువకుడిపై ముగ్గురు వ్యక్తులు మూకుమ్మడి దాడి చేసిన వైనమిది. పోలీసుల కథనం ప్రకారం.. కలిదిండి మండలం పెదలంక గ్రామానికి చెందిన దుగ్గిరాల అయ్యప్ప (24) భాస్కరరావుపేటకు చెందిన యువతిని రెండు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వివాహం అంగీకరించని యువతి తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో యువతి పుట్టింటికి తీసుకెళ్లిపోయారు. మూడు నెలల తర్వాత పెద్దల సమక్షంలో వారిద్దరికి మళ్లీ పెళ్లి చేస్తామన్నారు. ఈ క్రమంలో అయ్యప్ప సోమవారం తెల్లవారుజామున చేపల చెరువు వద్దకు వెళ్తుండగా పిళ్లారిశెట్టి నాగు, మరో ఇద్దరు దారి కాచి మా అమ్మాయినే ప్రేమ పెళ్లి చేసుకుని అల్లరి చేస్తావా? అంటూ కర్రలతో మూకుమ్మడిగా దాడి చేశారు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

ముసునూరు, మార్చి 5: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై వివరాల ప్రకారం గుడిపాడు గ్రామానికి చెందిన పల్లి లక్ష్మీ సుశీల అనే మహిళ ఇంటివద్దే అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న క్రమంలో ఎస్సై పి.వాసు తన సిబ్బందితో కలిసి దాడిచేశారు. ఇంట్లో అక్రమంగా ఉన్న ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వాసు తెలిపారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని

దేశంలోనే ధనిక సీఎం జగన్

మండవల్లి, మార్చి 5: దేశంలో అత్యధిక ధనిక సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఆయనే పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం అనడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండవల్లి మండలం చింతలపూడి, లేళ్ళపూడి, పసలపూడి గ్రామాల్లో ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు కామినేనికి ఘన స్వాగతం పలికారు. సమావేశాల్లో కామినేని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలంతా కట్టే ట్యాక్సుల సరిపోకపోవడంతో జే-ట్యాక్స్ కట్టాల్సి వస్తోందన్నారు. వైసీపీ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాక నీటి సమస్యతో రైతులు నష్టపోతున్నారన్నారు. 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్‌దేనని అలాగే కైకలూరు నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలు పెరిగిపోయాయని ఈ పాలనను తరిమికొట్టేందుకు ప్రజలంతా కలసికట్టుగా పనిచేయాలన్నారు. తాను కూడా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. ఎస్సీ సెల్ నాయకుడు తేరా రమేష్ బాబు, రైతు సంఘం నాయకుడు ముళ్లపూడి సత్తిబాబు, పార్టీ గ్రామ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



ముదినేపల్లి, మార్చి 5: ముదినేపల్లి మండలం ములకలపల్లి, ఈడేపల్లి, కొరగుంటపాలెం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, పక్కా డ్రైన్లను ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మంగళవారం ప్రారంభించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య సర్పంచ్ నువ్వుల కోటేశ్వరరావు, ఎంపీటీసీ రెడ్డి సతీష్‌బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు అచ్యుత రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరంపై గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు.



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భవానీ శంకరి

బలివే ఉత్సవాలపై ఆర్డీవో సమీక్ష

ముసునూరు, మార్చి 5: బలివే శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఐదురోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని నూజివీడు ఆర్డీవో భవానీశంకరి అధికారులను హెచ్చరించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఆమె అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించి మాట్లాడుతూ నూజివీడు - ఏలూరు ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్న నేపథంలో కనీస మరమ్మతులను చేయాలని ఆదేశాలు జారీ చేసినా ఎందుకు చేయలేదని ఆర్‌అండ్‌బీ అధికారులను నిలదీశారు. జల్లు స్నానాలు ఏర్పాటుతో పాటు తమ్మిలేరు జలాలు ఆలయం చెంతకు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, అధికారులకు సూచించారు. మరుగుదొడ్లు, మహిళలకు ప్రత్యే కంగా తాత్కాలిక గదులను ఇప్పటివరకు ఎందుకు ఏర్పాటుచేయలేదని పంచా యతీ అధికారులను ప్రశ్నించారు. క్యూలైన్‌లో నిలబడే భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు మజ్జిగ, ఇతర పానీయాలను సైతం అందించాలన్నారు. అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉత్సవాల్లో అనధికార మద్యం విక్రయాలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని, ఎక్సైజ్ పోలీసులకు ఆర్డీవో సూచించారు. ఉత్సవాల్లో లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారని పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆమె సూచించారు. రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని, టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య, తహసీల్దార్ జవహర్ బాబీ, ఎంపీడీవో పద్మావతి దేవి, సీఐ కె.రామకృష్ణ, ఎస్సై పి.వాసు, ఆలయ ఈవో సతీష్‌కుమార్, ఆలయ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆటపాకలో కరపత్రాలిస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

టీడీపీ-జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

కైకలూరు, మార్చి 5: జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఆటపాక గ్రామశివారు నాగపురం, అగ్రహారం రోడ్డులో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. రౌడీ రాజకీయాలు, అరాచకాలు రూపుమాపాలంటే జనసేన-టీడీపీ కూటమిని అధికారంలోకి తేవాలన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు విజయలక్ష్మి, జనసేన మహిళా నాయకులు తోట లక్ష్మి, శాంతి రాజేశ్వరి, జనసేన నాయకులు పుప్పాల సూర్యప్రకాశరావు, ఘెగాపుల రామాంజనేయులు, వేల్పూరి మణికంఠ, ముత్యాల తరుణ్‌సాయి, తులసి శివ, తోట సంజయ్, కొటికలపూడి ఈశ్వర్, అల్లాడ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'భోజనం'లో నిబంధనలు పాటించాలి



కలిదిండి, మార్చి 5 : ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకంలో నిబంధనలు పాటించాలని పథకం అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్ అన్నారు. మంగళవారం కలిదిండి విద్యాశాఖ కార్యాలయంలో మండల ప్రధానోపాధ్యా యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మొదటి వారంలో బ్లూ కలర్ గుడ్లు, రెండవ వార్డులో పింక్ కలర్, మూడవ వారంలో గ్రీన్ కలర్, నాల్గవ వారంలో బ్రౌన్ కలర్ గుడ్లు విద్యార్థులకు విధిగా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సరఫరా చేస్తున్న గ్రీన్ కలర్ ట్యాగ్ ఉన్న బియ్యం మాత్రమే వాడాలన్నారు. నాణ్యత కలిగిన చిక్కీలను వాడాలన్నారు. ఎంఈవో ప్రభాకర్ బాబు, మధ్యాహ్న భోజన పథకం కో-ఆర్డినేటర్ బి.కుమార్, గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ముదినేపల్లి, మార్చి 5 : కూలి పనులు చేసుకుంటూ మద్యానికి బానిసై అనారోగ్యంతో మరణించిన ముదినేపల్లికి చెందిన కావూరి నాగరాజు కుటుంబానికి పలువురు ఆర్థిక సాయమందించారు. టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.5 వేల చొప్పున అంత్యక్రియలకు నగదు సహాయం అందజేశారు.

నేటి నుంచి పాతాళ భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు



ముస్తాబైన ఆలయం



స్వామివారు

కలిదిండి, మార్చి 5 : కలిదిండిలోని పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 6న విఘ్నేశ్వర పూజ, స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమా రుడు, పెండ్లి కుమార్తెలను చేయటం, 7న ఆలయ చైర్మన్ అడివి వెంకట గంగాధర శర్మ దంప తులతో స్వామివారి కళ్యాణం 8న మహా శివరాత్రి తీర్థం జరుగుతుందన్నారు. అనంతరం తపస్సు చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. దక్షిణ కాశీగా వెలుగొందుతూ అత్యంత ప్రాధాన్యం కలిగిన పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారు. వీరికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆవర ణలో చలువ పందిళ్ల వేశారు. పంచబుగ్గల కోనేరును స్వచ్ఛనీటితో నింపారు. భక్తుల పుణ్యస్నానాలకు షూట్‌లు ఏర్పాటు చేశారు. తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు చేస్తున్నామని కలిదిండి సర్పంచ్ మారుతీ ప్రసన్న తెలిపారు. ఉత్సవాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

17న కైకలూరులో చంద్రబాబు పర్యటన

కైకలూరు, మార్చి 5: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 17న కైకలూరులో పర్యటిస్తారని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన కైకలూరులో పర్యటిస్తారని ప్రత్యేక టీంలు సభాప్రాంగణాన్ని పరిశీలిస్తాయని వివరించారు. చంద్రబాబు పర్యటన టీడీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపుతుందని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, మార్చి 5: కైకలూరు, కలిదిండి మండలాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ గుడివాడ ఈఈ టి. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ముదినేపల్లి మండలంలోని చిగురుకోటలో సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కైకలూరు, కలిదిండి మండలాలతో పాటు మండవల్లి మండలం లోకుమూడి, చావలిపాడు, భైరవపట్నం గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

రేపు మండల టీడీపీ సమావేశం

కైకలూరు, మార్చి 5: ఈ నెల 7వ తేదీన టీడీపీ కైకలూరు మండల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు కైకలూరు టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశానికి రాష్ట్ర, జిల్లా స్థాయి పదవుల్లో ఉన్న నాయకులు, నియోజకవర్గ స్థాయిలోనూ వివిధ పదవుల్లో ఉన్న నాయకులు కైకలూరు మండలంలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ పార్టీ నాయకులు, మాజీ ప్రతినిధులు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

10న జిల్లా మహాసభ విజయవంతం చేయాలి

ముసునూరు, మార్చి 5: రాష్ట్ర పాఠశాలల పారిశుధ్య కార్మికుల మూడో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం రమణక్కపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన నూజివీడులో జరిగే ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య కార్మికుల మూడో జిల్లా మహాసభకు మండల వ్యాప్తంగా ఉన్న కార్మికులంతా హాజరుకావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, పారిశుధ్య కార్మికులందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య, రాష్ట్ర నాయకులు టి.అరుణ, పల్లెపాం భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఆరుగురు గైర్హాజరు

ముదినేపల్లి, మార్చి 5: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మంగళవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ -2 పరీక్ష 195 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, ఆరుగురు విద్యార్థులు హాజరు కాలేదు. చీఫ్ సూపరింటెండెంట్ ఒ.సత్యనారాయణమూర్తి, డిపార్ట్‌మెంటల్ అధికారి కేవీవీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయి.

తాత్కాలిక భృతిని విడుదల చేయండి

నూజివీడు టౌన్, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని విడుదల చేయటంలో జాప్యం జరిగినందున తాత్కాలిక భృతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరావు కోరారు. నూజివీడులో మంగళవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్సీని, తాత్కాలిక భృతిని విడుదల చేయాలని, పెండింగ్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఈమని శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

ఆగిరిపల్లి, మార్చి 5: చొప్పరమెట్లలోని మెగా గ్యాస్ ఆధ్వర్యంలో జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభించారు. ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ రవికిరణ్ మాట్లాడుతూ ఈ నెల 10 వరకు జిల్లా పరిధిలో వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆగిరిపల్లి తహసీల్దార్ మృత్యుంజయరావు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులు వంటగదిలోకి గాలి, వెలుతురు వచ్చేలా పెద్ద కిటికీలు అమర్చుకోవాలని, మండే స్వభావం కలిగిన వస్తువులను దూరంగా ఉంచాలని తెలిపారు. సేఫ్టీ అధికారి సత్యరమేష్ మాట్లాడుతూ గ్యాస్ వినియోగించే వాహనదారులు బంకులో గ్యాస్ నింపేటప్పుడు వాహనాల్లో ఉండరాదని, అలాగే వాహనాలు ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించుకుని కండిషన్‌లో ఉంచాలని కోరారు. ఏఎస్సై నాయక్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయం శిరోధార్యం : మరిడి



చాట్రాయి, మార్చి 5: టీడీపీ మండల అధ్యక్షురాలిగా బొట్టు వరలక్ష్మిని నియమిస్తూ, అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం తనకు శిరోధార్యమని తాజా మాజీ అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు (చిట్టిబాబు) అన్నారు. తనకు పార్టీ ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో పనిచేశానని, తనపై కొందరు సొంత పార్టీ నాయకులు చేసిన దుష్ప్రచారాన్ని పార్టీ పెద్దలు నమ్మి ఇటువంటి నిర్ణయం తీసుకోవటం తనను బాధించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి విజయానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు.



నూజివీడులో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. అధికారులకు తోడు స్థానిక పలువురు వ్యాపారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రధాన డ్రైన్‌లు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి చిన్నపాటి వర్షం వస్తే రహదారులే డ్రైన్‌లుగా మారే పరిస్థితి నెలకొంది.

నూజివీడు టౌన్ చర్చి రోడ్డు డ్రైన్‌లో పేరుకున్న వ్యర్థాలు

మురుగు పారేదెలా..?

- డ్రైన్ల లోనే చెత్త! ▸ పూడిక తీతకు ఏటా రూ. 10 లక్షల వ్యయం
- అయినా షరా మామూలే..
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- వ్యర్థాలను డ్రైన్లలోనే పడవేస్తున్న పలువురు వ్యాపారులు

(నూజివీడు-టౌన్)

నూజివీడు మున్సిపల్ పరిధిలో ప్రధాన రహదారుల పై ఉన్న డ్రైన్‌లు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి కనీసం మురుగునీరు పారని పరిస్థితి నెలకొంది. నూజివీడు పెద్దగాంధీబొమ్మ సెంటర్ నుంచి చిన్నగాంధీబొమ్మ సెంటర్‌కు వచ్చే మార్గంలో గాంధీ పార్క్ వద్ద మెయిన్‌రోడ్డుపై ప్రధాన కూడలి అయిన చిన్న గాంధీబొమ్మ సెంటర్ వద్ద డ్రైన్‌లలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు పారడం లేదు. ఇటు టౌన్ చర్చ్ రోడ్డుపై, బాపూనగర్ సీఎస్ఐ చర్చి సమీపంలోనూ ప్రధాన డ్రైన్‌లలో వ్యర్థాలు తొలగించకపోవడంతో ఇక్కడ వ్యర్థాల కుప్పగా ఏర్పడ్డాయంటే ఆశ్చర్యం కలగక మానదు.

కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే...

నూజివీడు పట్టణంలో డ్రైన్‌లలో పూడికతీతకు ప్రతి ఏటా రూ.10లక్షలకు పైబడి ఖర్చు చేస్తున్నారు. అయినా అతి కొద్దికాలానికే డ్రైన్‌లు పూర్తిగా పూడుకుపోతున్నాయి. అందుకు నూజివీడు మున్సిపల్ అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురవుతోందని పట్టణవాసులు అంటున్నారు. నూజివీడు పట్టణంలో వివిధ వ్యాపార వర్గాలు, పలు హోటళ్ళ నిర్వాహకులు నిత్యం ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను నేరుగా డ్రైన్‌లలో పారవేయడంతో ఈ పరిస్థితి నెలకొంటోందని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నూజివీడు ఆర్డీవో బి.సుబ్బారావు ప్రత్యేకాధికారిగా పనిచేసిన సమయంలో వ్యాపార వర్గాలతో చర్చించి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు డ్రైన్‌లలోకి వెళ్ళకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం వచ్చిన పాలకవర్గాలు గాని, ప్రత్యేక అధికారులు కాని పారిశుధ్య నిర్వహణపై చర్యలు తీసుకోక పోవడంతో ఇదిగో ఇలా ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైన్‌లలో చేరి డ్రైన్‌లు వ్యర్థాలమ యంగా మారుతున్నాయని నూజివీడు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బాపూనగర్ సీయస్ఐ చర్చి వద్ద డ్రైన్‌లో పేరుకున్న వ్యర్థాలు

కృత్రిమ కాళ్ల వితరణ



ఆగిరిపల్లి, మార్చి 5: తోటపల్లిలో గల కృత్రిమ అవయువ కేంద్రంలో దాతల సహకారంతో ఇద్దరు దివ్యాంగ బాలురకు కృత్రిమ కాళ్ళు అమర్చారు. కృష్ణ చైతన్య డైరీఫామ్ అధినేతలు అరవపల్లి రామకృష్ణ, శ్రీమతి దుర్గాభారతి, వత్స చిట్టిబాబు, భ్రమరాంబ అందజేసిన విరాళంతో కర్నూలు జిల్లా వాసి డి.విష్ణు, ప్రకాశం జిల్లా వాసి వై.సూర్యకుమార్‌కు కృత్రిమకాళ్ళు అందజేశారు. హీల్ ప్రిన్సిపాల్ డి.సాయిబాబు, కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దుగ్గిరాల రావమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ఆగిరిపల్లి, మార్చి 5: ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలోని దుగ్గిరాల రావమ్మ హుండీ ఆదాయాన్ని మంగళవారం దేవదాయ ధర్మాదాయ గన్నవరం తనిఖీదారు వి.సుధాకర్ పర్యవేక్షణలో లెక్కించారు. ఫిబ్రవరి 22 నుంచి 24 వరకు మూడురోజుల తిరునాళ్ళ సందర్భంగా రూ.2,85,628 హుండీ ఆదాయం వచ్చినట్టు ఆలయ కమిటీ చైర్మన్ వీరంకి ఆంజనేయులు తెలిపారు. సభ్యులు, గ్రామస్థులు, ఆలయ ఈవో జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.